మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

నేటి ఈవార్తలు

PRGI REGD NO: TGTEL/25/A1385

Published from Jagitial
Circulated to Telangana

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 27-3-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 267 Issue: 267

27 మార్చి 2026 - శుక్రవారం, శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఉత్తరాయణం - వసంత ఋతువు, చైత్ర మాసం - శుక్లపక్షం, సూర్యోదయం - ఉ. 6:18, సూర్యాస్తమయం - సా. 6:24, తిథి, నవమి ఉ. 10:08 వరకు, తరువాత దశమి, సంస్కృత వారం, భృగు వాసరః నక్షత్రం పునర్వసు మ. 3:24 వరకు, తరువాత పుష్యమి, యోగం, అతిగండ రా. 10:11 వరకు, కరణం, కౌలవ ఉ. 10:08 వరకు, తైతుల రా. 9:27 వరకు, వర్జ్యం, రా. 11:13 నుండి రా. 12:47 వరకు, దుర్ముహూర్తం, ఉ. 8:43 నుండి ఉ. 9:32 వరకు, మ. 12:45 నుండి మ. 1:34 వరకు, రాహుకాలం, ఉ. 10:50 నుండి మ. 12:21 వరకు, యమగండం, మ. 3:23 నుండి సా. 4:54 వరకు, గుళికాకాలం, ఉ. 7:49 నుండి ఉ. 9:20 వరకు. బ్రహ్మముహూర్తం, తె. 4:42 నుండి తె. 5:30 వరకు, అమృత ఘడియలు, మ. 1:44 నుండి మ. 3:16 వరకు, అభిజిత్ ముహూర్తం, ఉ. 11:57 నుండి మ. 12:45 వరకు


www.evarthalu.com

ఏపీలోని మార్కాపురం జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదం జరిగింది. తెలంగాణలోని జగిత్యాల జిల్లా నుంచి 35 మందితో వెళ్లిన హరికృష్ణ ట్రావెల్స్‌కు చెందిన ఆ ప్రైవేటు బస్సు.. గురువారం తెల్లవారుజామున 4 గంటలకు రాయవరం సమీపంలోకి రాగానే పలకల క్వారీ వద్ద టిప్పర్‌ను ఢీకొట్టడంతో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో 14 మంది సజీవ దహనం అయ్యారు. మరో 21 మందికి తీవ్ర గాయాలు అయినట్లు అధికారులు వెల్లడించారు. వారిలో ముగ్గురి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు పేర్కొన్నారు.



# అగ్గికి ఆకలి..

## 14 మంది సజీవ దహనం!



- మార్కాపురంలో ఘోర బస్సు ప్రమాదం
- ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో ఫైర్ యాక్సిడెంట్
- మరో 21 మంది తీవ్ర గాయాలు
- బస్సు రిపేర్ చేసిన కాసేపటికే ఘోరం

జగిత్యాల (టీజీ)/మార్కాపురం (ఏపీ), మార్చి 26 (ఈవార్తలు): బస్సు ప్రమాదానికి సంబంధించి ఓ కీలక విషయం వెలుగులోకి వచ్చింది. బస్సు కండీషన్ సరిగా లేదని.. ప్రమాదానికి ముందే అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఆ బస్సు పరిస్థితి బాగా లేదని ముందే డ్రైవర్‌తో చెప్పారు. ఈ క్రమంలోనే యర్రగొండపాలెం వద్ద బస్సును గంటసేపు నిలిపేసిన డ్రైవర్.. దానికి మరమ్మతులు చేసినట్లు

- తరువాయి 2 వ పేజీలో...



# ఈవార్తలు ఎడిటర్‌కు కలంరత్న జర్నలిస్టు అవార్డు

'ఈవార్తలు' దినపత్రిక ఎడిటర్ బొమ్మకంటి శ్రావణ్ కుమార్‌కు 'కలం రత్న' ఉత్తమ జాతీయ జర్నలిస్టు పురస్కారం దక్కింది. గురువారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో వసుంధర విజ్ఞాన వికాస మండలి 33వ వార్షికోత్సవంలో భాగంగా ఆయనను ఉత్తమ పురస్కారంతో సత్కరించారు. రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారి, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం తదితరులు శాలువా కప్పి మెమెంటో, సర్టిఫికెట్ అందజేశారు. చిత్రంలో వసుంధర విజ్ఞాన వికాస మండలి వ్యవస్థాపకుడు మధుకర్ వైద్యుల తదితరులు ఉన్నారు.



నేటి 'ఈవార్తలు' దినపత్రిక పాఠకులు, శ్రేయోభిలాషులు, హిందూ బంధువులకు శ్రీరామనవమి శుభాకాంక్షలు.

# మోదీ ఏం చెప్తారు?



**మళ్లీ లాక్‌డౌన్ విధిస్తారా?.. లేక జాగ్రత్తలు చెప్తారా?.. నేడు సీఎంలతో వీసీ**

పశ్చిమాసియాలో కొనసాగుతోన్న యుద్ధం నేపథ్యంలో దేశంపై దాని ప్రభావం, పరిణామాలపై చర్చించేందుకు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం సమావేశం కానున్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎంలతో ప్రధాని మాట్లాడనున్నారు. పశ్చిమాసియా సంఘర్షణపై ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

న్యూఢిల్లీ: ఇప్పటికే ఈ అంశంపై ప్రధాని.. పార్లమెంట్ ఉభయ సభల్లోనూ మాట్లాడారు. కరోనా కాలం నాటి పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉందని ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రులతో ప్రధాని సమావేశం కానుండటంతో ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటారు? ఏం సూచనలు చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఇరాన్, ఇజ్రాయెల్–అమెరికా యుద్ధంతో ప్రపంచవ్యాప్తంగా చమురు,

- తరువాయి 2 వ పేజీలో...

## పీఆర్సీ గడువు

# మళ్లీ పొడిగింపు

**ప్రభుత్వ ఉద్యోగులకు మళ్లీ నిరాశే**




హైదరాబాద్, మార్చి 26 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన వేతన సవరణ కమిషన్ గడువును రేవంత్ రెడ్డి సర్కార్ మరోసారి పొడిగించింది. దీంతో ఎన్నాళ్ల నుంచో జీతాలు పెరుగుతాయని ఎదురుచూస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు మరోసారి మొండిచేయిగా మారింది. ఈ నెలాఖరుతో పీఆర్సీ కమిటీ గడువు ముగియనుండగా.. మరో 6 నెలల పాటు పొడిగిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో మరో 6 నెలల పాటు పీఆర్సీ అమలు వాయిదా పడింది. ప్రస్తుత పీఆర్సీ కమిటీ గడువు ఈనెల 31వ తేదీతో ముగియనుంది. కొత్తగా పొడిగించిన

- తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు



**బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)**

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,689 |
| వెండి (గ్రాము): | రూ.260 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,790 |

**బిగ్ రిలీఫ్..**

# విశాఖకు ఎల్పీజీ నౌక




విశాఖపట్నం, మార్చి 26 (ఈవార్తలు): పశ్చిమాసియాలో జరుగుతోన్న యుద్ధం కారణంగా వంట గ్యాస్ కొరతపై ఆందోళన నెలకున్నాయి. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ముఖ్యంగా విశాఖవాసులకు ఊరట లభించింది. 'బీడబ్ల్యూ బిర్చ్' అనే భారీ ఎల్పీజీ ట్యాంకర్ గురువారం విశాఖ నౌకాశ్రయానికి చేరుకుంది. ఇందులో భారీ ఎత్తున వంట గ్యాస్ నిల్వలు ఉన్నాయి. గుజరాత్‌లోని వడినార్ పోర్టులో నందా దేవి నుంచి షిప్-టు-షిప్ బదిలీ ద్వారా ఎల్పీజీని బీడబ్ల్యూ బిర్చ్‌లో లోడ్ చేశారు. దీంతో ఎల్పీజీ సరఫరాకు అడ్డంకులు తొలిగిపోనున్నాయి. బిర్చ్‌తో పాటు 'ఎంటీ పెట్రాయిట్' అనే ఆయిల్ ట్యాంకర్ నౌక కూడా ఇప్పటికే విశాఖకు చేరింది. ఇది పెట్రోల్, డీజిల్ అవసరాలకు సరిపడా నిల్వలను మోసుకొచ్చింది. వీటితో పాటు హెల్లాస్ గ్లాడియేటర్, గ్యాస్ జ్యూపిటర్ అనే మరో రెండు నౌకలు చెరో 24 వేల టన్నుల గ్యాస్‌తో బయలుదేరాయి. ఇవి మార్చి 30

- తరువాయి 2 వ పేజీలో...

# బంకుల్లోనే పడిగాపులు

**బారులు తీరిన వాహనదారులు**


(ఈవార్తలు న్యూస్ నెట్‌వర్క్)

బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనం ఇస్తుండటంతో జనంలో ఆందోళన నెలకొంది. ఇది మరింత ఆందోళన పెంచింది. దీంతో ఇంధన కొరత ఉంటుందన్న భయం, అనుమానాలతో.. పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు క్యూ కడుతున్నారు. గత రెండ్రోజులుగా బంకుల వద్ద బారులు తీరిన జనం.. గురువారం కూడా బంకుల వద్ద పడిగాపులు కాశారు. పరిస్థితి చేయిదాటిపోతుండటంతో కేంద్ర ప్రభుత్వం.. గురువారం మరోసారి స్పష్టత ఇచ్చింది. దేశంలో పెట్రోల్, డీజిల్‌కు ప్రస్తుతానికి అసలు కొరతే

- తరువాయి 2 వ పేజీలో...



## విశ్వవాణి



ప్రేమ గుడ్డిది.. ఎవరితో ప్రేమలో పడాలో కూడా తెలీదు.. ఇవీ మనం తరచూ వినే మాటలు. కానీ, ప్రేమ అనేది హృదయం కంటే మెదడుకు సంబంధించిన ఓ అద్భుతమైన అనుభూతి అని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. ఒక వ్యక్తి అవతలి వ్యక్తితో ప్రేమలో పడాలంటే ముందుగా, భద్రంగా ఉంటామన్న ఫీల్ కలగాలట. ఆ వ్యక్తి కనిపించగానే ఉత్సాహం కలగాలట. అప్పుడే డొపమైన్, ఆక్సిటోసిన్ హార్మోన్లు విడుదలై ప్రేమికులను ఒక్కటి చేస్తుందట.

# విద్య, వైద్యం మా ప్రాధాన్యం

- మరిన్ని నిధులను అందజేస్తాం
- గత తప్పులను సరిదిద్దుతున్నాం
- అసెంబ్లీలో సీఎం రేవంత్ వెల్లడి



సమాజంలో వైద్య రంగం ఎప్పటికప్పుడు కొత్త సవాళ్లను ఎదుర్కొంటోంది. ప్రజలకు ఉపయోగపడే సూచనలను స్వీకరిస్తాం. ఏది ఏమైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత విద్య, వైద్యం. విద్య పరంగా నర్సరీ నుంచి 10 వరకు, వైద్యం పరంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి స్పెషాలిటీ హాస్పిటల్స్ వరకు ఒక ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నాం. మంచి రోల్ మాడల్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముందుకెళుతున్నాం' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమగ్రంగా వివరించారు.ఎన్ని అడ్డంకులు ఎదురైనా విద్య వైద్యం మా ప్రాధాన్యం

- సీఎం రేవంత్ రెడ్డి



# ఇరాన్ నేవీ చీఫ్ మృతి

టెహ్రాన్: ఇరాన్ ఎలైట్ నేవల్ ఫోర్స్ కమాండర్ అలీరేజా తంగ్‌సీరీ దక్షిణ ఇరాన్‌లో జరిగిన దాడిలో మరణించినట్లు ఇజ్రాయెలీ అధికారి ఒకరు వెల్లడించారు. పశ్చిమాసియాలో యుద్ధం నాలుగవ వారం కొనసాగుతున్న సమయంలో

- తరువాయి 2 వ పేజీలో...

# అసెంబ్లీ.. ఆటలా?

**బడ్జెట్ పద్దు వేళ క్రీడా పోటీలేంటి?.. సర్కారుపై కేటీఆర్ మండిపాటు**

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్న సమయంలో గురువారం లాబీల్లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. అసెంబ్లీ సమావేశాల్లో అత్యంత కీలకమైన పద్దులపై చర్చలతో కొనసాగుతున్న సమయంలో ఎమ్మెల్యేలకు ఆటల పోటీలు నిర్వహించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టారు.



హైదరాబాద్, మార్చి 26 (ఈవార్తలు): ఇంత సీరియస్‌గా సభ జరుగుతున్న సమయంలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఇదే విషయాన్ని తాను శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లగా ఆయన నుంచి ఎలాంటి సమాధానం లేదని మాజీ

- తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు

27-3-2026

మేషం: వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. నేత్ర ఉదర అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. చేపట్టిన వ్యవహారాలలో అవరోధాలు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. మిత్రులతో ఊహించని కలహాలు కలుగుతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలు నిదానంగా సాగుతాయి.

వృషభం: కుటుంబ సభ్యులతో శుభకార్యాలకు హాజరవుతారు. సంఘంలో ప్రముఖుల ఆదరణ పెరుగుతుంది. సమాజంలో పలుకుబడి పెరుగుతుంది. చేపట్టిన పనుల్లో విజయం సాధిస్తారు. చిన్ననాటి మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. నూతన వాహన యోగం ఉన్నది. ఉద్యోగాలలో పురోగతి సాధిస్తారు.

మిధునం: నూతన ఋణాలు చేస్తారు. బంధుమిత్రులతో కొన్ని వ్యవహారాలలో విభేదాలు కలుగుతాయి. ఆరోగ్య ససమ్యలు చికాకు పరుస్తాయి. కొన్ని పనులు మధ్యలో వాయిదా పడతాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు వాయిదా పడతాయి. ఉద్యోగాలలో అధికారుల నుంచి ఒత్తిడి పెరుగుతుంది.

కర్కాటకం: ఆప్తుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. ఆర్థికంగా కొంత మెరుగైన పరిస్థితులు ఉంటాయి. ప్రయాణాలలో నూతన వ్యక్తుల పరిచయాలు కలుగుతాయి. చేపట్టిన పనులలో అనుకూల వాతావరణం ఉంటుంది. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు.

సింహం: నూతన పరిచయాలు లాభసాటిగా సాగుతాయి. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. ఇంటాబయట అనుకూల వాతావరణం ఉంటుంది. చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపార ఉద్యోగాలలో సంతృప్తికర వాతావరణం ఉంటుంది.

కన్య: ఆర్థిక ఇబ్బందులు వలన నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. చేపట్టిన పనుల్లో జాప్యం కలుగుతుంది. మిత్రులతో కొన్ని వ్యవహారాలలో మాటపట్టింపులు కలుగుతాయి. గృహ విషయమై ఆలోచనలు స్థిరంగా ఉండవు. స్వల్ప అనారోగ్య సూచనలు ఉన్నవి. ఉద్యోగాలు సామాన్యంగా సాగుతాయి.

తుల: బంధుమిత్రులతో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. కుటుంబ సమస్యలు చికాకు పరుస్తాయి. అనారోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. ముఖ్యమైన వ్యవహారాలు ముందుకు సాగవు. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. వ్యాపారాలు కొంత నిదానంగా సాగుతాయి. ఉద్యోగమున పని ఒత్తిడి అధికామౌతుంది.

వృశ్చికం: చేపట్టిన పనులు సజావుగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. వృత్తి ఉద్యోగాలలో హోదాలు పెరుగుతాయి. నూతన గృహ నిర్మాణ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. ఆప్తుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది.

ధనస్సు: చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగమున అధికారులతో చర్చలు సఫలం అవుతాయి. దూరపు బంధువుల కలయిక ఆనందం కలిగిస్తుంది. వ్యాపారాలలో నూతన పెట్టుబడులు అందుతాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి.

మకరం: వృత్తి వ్యాపారాలలో ఆలోచనలు నిలకడగా ఉండవు. ఇంటాబయట బాధ్యతలు పెరుగుతాయి. ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి. కుటుంబ పెద్దల ఆరోగ్యం విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. వ్యాపారాలు కొంత మందగిస్తాయి. ఉద్యోగాలలో చికాకులు పెరుగుతాయి.

కుంభం: ముఖ్యమైన వ్యవహారాలు శ్రమతో కానీ పూర్తికావు. కొన్నిపనులు వాయిదా వేస్తారు. ఆరోగ్య విషయంలో వైద్య సంప్రదింపులు చేయవలసి వస్తుంది. ఆర్థిక వ్యవహారాలు నిరాశ కలిగిస్తాయి. వృత్తి వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి. ఉద్యోగులకు అదనపు బాధ్యతల వలన తగిన విశ్రాంతి ఉండదు.

మీనం: చిన్ననాటి మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. విలువైన వస్త్రాలు ఆభరణాలు కొనుగోలు చేస్తారు. దాయాదులతో భూవివాదాలు పరిష్కారమౌతాయి. చేపట్టిన పనులలో యత్నకార్యసిద్ధి కలుగుతుంది. సంఘంలో ఆదరణ పెరుగుతుంది. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపార, ఉద్యోగాలలో అంచనాలు అందుకుంటారు.





# అగ్గికి ఆకలి..

మొదటి పేజీ తరువాయి

ప్రయాణికులు వెల్లడించారు. రిపేర్ల తర్వాత బస్సు బయల్దేరి కొంత దూరం వెళ్లిన తర్వాత రాయవరం వద్ద ఈ ఘోర ఘటన జరిగినట్లు చెప్పారు. ఈ ప్రమాదం తర్వాత అధికారులు బస్సు డ్రైవర్‌ను విచారణ జరపగా, స్టీరింగ్ స్ట్రక్ అయినట్లు చెప్పినట్లు సమాచారం. కానీ ఈ ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన బస్సు క్లీనర్ మహేంద్ర వాదన మాత్రం మరో రకంగా ఉంది. బస్సు ప్రమాదం నుంచి మొట్టమొదటగా తానే ప్రాణాలతో బయటపడినట్లు తెలిపాడు. తాను నిద్రపోతున్న సమయంలో ప్రమాదం జరిగిందని, లేచి చూసేసరికి బస్సు మొత్తం మంటల్లో చిక్కుకుందని పేర్కొన్నాడు. మంటలను ఆర్పే సిలిండర్లు బస్సులో ఉన్నాయని, కానీ దట్టమైన పొగ కారణంగా అవి కనిపించలేదని వివరించాడు. చాలా మంది అద్దాలు పగలగొట్టి బయటపడి ప్రాణాలు రక్షించుకున్నారని తెలిపాడు. బస్సు కండీషన్ బాగానే ఉందని క్లీనర్ మహేంద్ర చెప్పాడు. మరోవైపు.. ఈ మార్కాపురం బస్సు ప్రమాద ఘటనపై ఆంధ్రప్రదేశ్ కేబినెట్ భేటీలో చర్చ జరిగింది. ఈ ఘటనలో చనిపోయిన వారికి ఏపీ కేబినెట్ సంతాపం తెలియజేసింది. అదే సమయంలో బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసింది. ఇక ఈ ఘోర ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలకు రూ.5 లక్షలు.. గాయాల పాలైన వారికి రూ.2 లక్షల చొప్పున పరిహారం ఇవ్వనున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. బాధితులకు మెరుగైన ట్రీట్‌మెంట్ అందించాలని.. ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించాలని మంత్రులు, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బస్సు ప్రమాదంపై సమీక్ష నిర్వహించిన సీఎం చంద్రబాబు.. ప్రమాదం తీరుపై ప్రాథమిక సమాచారాన్ని జిల్లా కలెక్టర్, ఎస్పీలను అడిగి తెలుసుకున్నారు. సమీక్షలో మంత్రులు అనిత, జనార్దన్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఘటనపై ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. బస్సు మంటల్లో కాలి బూడిదై అందులో ప్రయాణికులు సజీవ దహనం కావడం అత్యంత విషాదమని మోదీ పేర్కొన్నారు. ఆస్పత్రుల్లో ఉన్న వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు.. గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున కేంద్ర ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి.. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ బస్సు ప్రమాద ఘటనపై ఏపీ అధికారులతో మాట్లాడాలని సీఎస్ రామకృష్ణారావును ఆదేశించారు. ప్రమాదానికి గురైన బస్సు జగిత్యాల నుంచి ప్రారంభమైన నేపథ్యంలో ఇక్కడి ప్రయాణికులు ఎవరైనా ఉన్నారా అనే వివరాలు తెలుసుకోవాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఏపీ సీఎస్‌తో తెలంగాణ సీఎస్ మాట్లాడారు.

**బస్సులో నెల్లూరు జిల్లాకు చెందిన 15 మంది ప్రయాణికులు**

బస్సు ప్రమాదంపై బాధితుల సహాయార్థం నెల్లూరు కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా వెల్లడించారు. నెల్లూరు కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణంలో 7995575699, 08612331261 నెంబర్లతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నెల్లూరు జిల్లాకు సంబంధించిన 15 మంది ప్రయాణికులు బస్సులో ఉన్నట్లు సమాచారం. ఈ ప్రమాదానికి సంబంధించి వివరాల కోసం పైన తెలిపిన కంట్రోల్ రూమ్ నెంబర్లను సంప్రదించాలి అని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు.

# పీఆర్సీ గడువు మళ్లీ పొడిగింపు

మొదటి పేజీ తరువాయి

గడువుతో సెప్టెంబర్ 30వ తేదీ వరకు పెరగనుంది. మరోవైపు.. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు చాలా కాలంగా కొత్త పీఆర్‌సీ కోసం ఎదురు చూస్తునే ఉన్నారు. అయితే.. పీఆర్‌సీ కమిటీకి సంబంధించిన కొత్త నివేదిక ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం వద్దకు చేరలేదు. ఈ నేపథ్యంలోనే పీఆర్సీ కమిటీ గడువు ఈనెల చివరితో ముగియనుండగా.. మరో 6 నెలలు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే పీఆర్‌సీ కమిటీ నివేదికను త్వరగా తెప్పించుకుని.. వేతనాలు సవరణ చేయాలని చాలా సార్లు ఉద్యోగ సంఘాల నేతలు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడం, వినతి పత్రాలు అందించడం చేశారు. అయినప్పటికీ కమిటీ రిపోర్టు సమర్పించకపోవడంతో అది వాయిదా పడుతూనే వస్తోంది. మరోవైపు.. ప్రస్తుతం జరుగుతున్న తెలంగాణ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ప్రతిపక్షాలు కూడా ప్రభుత్వ ఉద్యోగుల పీఆర్సీ విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని అసెంబ్లీలోనే ప్రశ్నించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 3 నెలల్లోనే కొత్త పీఆర్సీని ప్రకటించి అమలు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చారని.. కానీ అధికారంలోకి వచ్చి రెండున్నళ్లు పూర్తి అవుతున్నా.. ఇప్పటికీ పీఆర్సీ ఇవ్వలేదని నిలదీశారు. మళ్లీ పీఆర్సీ కమిటీని పొడిగిస్తారా లేక ఇప్పుడైనా నివేదిక తీసుకుని ఉద్యోగులకు కొత్త పీఆర్సీ ఇస్తారా అని ప్రశ్నించింది. ఉద్యోగులకు ఎప్పటిలోగా పీఆర్సీ అమలు చేస్తారో స్పష్టంగా చెప్పాలని రెండు రోజుల క్రితమే అసెంబ్లీలో.. బీఆర్‌ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు.. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఈ క్రమంలోనే తాజాగా ప్రభుత్వం మరోసారి పీఆర్సీ కమిటీ పొడిగింపునకే మొగ్గు చూపడం గమనార్హం. ఈ నిర్ణయంతో ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త వేతనాల అమలు కావడం మరింత ఆలస్యం కానుంది.

# మోదీ ఏం చెప్తారు?

మొదటి పేజీ తరువాయి

గ్యాస్ సరఫరాపై ఆందోళనలు నెలకున్నాయి. ఇప్పటికే యుద్ధం కారణంగా చమురు ధరలు భారీగా పెరిగాయి. అయితే, దేశంలో సరిపడా చమురు, గ్యాస్ నిల్వలు ఉన్నట్టు ప్రభుత్వం ఇప్పటికే పలు సందర్భాల్లో స్పష్టత ఇచ్చిన విషయం తెలిసిందే. యుద్ధ పరిస్థితులు, దాని ప్రభావం గురించి బుధవారం కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం కూడా నిర్వహించారు. ఇంధన భద్రత విషయంలో ఆందోళన అవసరం లేదని ఈ సందర్భంగా కేంద్రం వివరించింది. పశ్చిమాసియా యుద్ధంపై ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంట్‌లో మాట్లాడుతూ.. "యుద్ధం తీవ్రమైన ఇంధన సంక్షోభాన్ని సృష్టించింది... భారత్ కూడా ఈ పరిస్థితి ఆందోళనకరంగా మారింది. మన వాణిజ్య మార్గాలు ప్రభావితమవుతున్నాయి. పెట్రోల్, డీజిల్, గ్యాస్, ఎరువులు లాంటి అత్యవసర వస్తువుల సాధారణ సరఫరాకు ఆటంకం ఏర్పడింది. గల్ఫ్ దేశాల్లో దాదాపు కోటి మంది భారతీయులు ఉపాధి పొందుతున్నారు. వారి భద్రత, జీవనోపాధి భారత్‌కు ఆందోళన కలిగిస్తోంది. హర్మూజ్ జలసంధిలో అనేక నౌకలు చిక్కుకుపోయాయి. వాటిలో పెద్ద సంఖ్యలో భారతీయ సిబ్బంది ఉన్నారు. ఇది కూడా భారత్‌కు తీవ్ర ఆందోళన కలిగించే విషయం. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో శాంతి, చర్చల ప్రాధాన్యం ప్రపంచానికి తెలియజెప్పేలా ముక్తకంఠంతో మన స్వరం వినిపించడం అవసరం" అని అన్నారు. యుద్ధం మొదలైనప్పటి నుంచి అనేక దేశాల నాయకులతో తాను మాట్లాడానని, నిరంతరం చర్చలు జరుపుతున్నామని ప్రధాని వివరించారు. పశ్చిమాసియా యుద్ధం ప్రభావం భారత్‌పై వీలైనంత తక్కువగా ఉండేలా నిరంతర ప్రయత్నాలు జరుగుతున్నాయని మోదీ తెలిపారు.

# బిగ్ రిలీఫ్..

మొదటి పేజీ తరువాయి

నాటికి విశాఖపట్నానికి చేరుకునే అవకాశం ఉంది. హెల్లాస్ గ్లాడియేటర్ నౌక నెదర్లాండ్ నుంచి, గ్యాస్ జ్యూపిటర్ అమెరికా నుంచి గ్యాస్‌ను తీసుకొస్తున్నాయి. ఇంధన సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతాయేమోనని అధికార యంత్రాంగం ఆందోళన చెందుతుండగా.. భారీ నిల్వలతో ఈ రెండు నౌకలు ఒకేసారి రావడంతో కాస్తా ఊపిరి పీల్చుకున్నారు. మార్కెట్‌లో కృత్రిమ కొరత ఏర్పడకుండా అవసరమైన చర్యలు తీసుకునే వీలుంటుందని అధికారులు తెలిపారు. ఈ పరిణామం కేవలం విశాఖకే కాకుండా ఉత్తరాంధ్ర జిల్లాల సప్లయ్ చైన్‌ను బలోపేతం చేయనుంది.

# విద్య, వైద్యం మా ప్రాధాన్యం

హైదరాబాద్, మార్చి 26 (ఈవార్తలు): ఎన్ని అడ్డంకులు ఎదురైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. గతంలో జరిగిన తప్పులను సరిదిద్దుకుంటూనే, నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి, అవసరమైతే మరిన్ని నిధులను సమకూర్చుతామని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పేదల వైద్యానికి ఎక్కడా నిధుల కొరత లేకుండా ఇప్పటివరకు అత్యధికంగా నిధులు వెచ్చించినట్టు వివరించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రభుత్వం గడిచిన 27 నెలల కాలంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి, ఎల్‌ఓసీ రూపంలో అందించిన ఆర్థిక సహాయానికి సంబంధించిన గణాంకాలను శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని అనేక అంశాలను తెలిపారు. 'రాష్ట్ర ప్రభుత్వం జరిపిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ సర్వే లెక్కల ప్రకారం తెలంగాణలోని 1.15 కోటి కుటుంబాలకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయబోతున్నాం. పేదలకు జీవిత బీమాను అందించి వారిలో ధీమా కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెడుతోంది. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 4,500 కోట్లు పేదల వైద్యం కోసం ఖర్చు చేశాం. గడిచిన 27 నెలల కాలంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ. 2046 కోట్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ. 2,400 కోట్లు మొత్తంగా రూ. 4,500 కోట్లు పేదల వైద్యం కోసం ఖర్చు చేశాం'అని సీఎం వెల్లడించారు. 'తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014 నుంచి 6వ డిసెంబర్ 2023 వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద ప్రతి నెలా సగటున రూ.52 కోట్లు ఖర్చు పెట్టింది. ఆ తర్వాత 7 డిసెంబర్ 2023 నుంచి 25 మార్చి 2026 కాలంలో ప్రజా ప్రభుత్వం సగటున ప్రతి నెలా రూ. 89 కోట్లు ఖర్చు పెట్టింది' అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 'గత ప్రభుత్వం బకాయిల భారాన్ని మాపై పెట్టింది. ఆ భారాన్ని మోస్తూనే.. రాజీవ్ ఆరోగ్యశ్రీ రూ. 5 లక్షల నుండి రూ. 10 లక్షలకు పెంచాం. 7 డిసెంబర్, 2023 నాటికి గత ప్రభుత్వం నుండి రాజీవ్ ఆరోగ్యశ్రీలో వారసత్వంగా వచ్చిన భారం రూ. 600.27 కోట్లు. అందులో ప్రభుత్వ ఆసుపత్రులకు రూ. 240.11 కోట్లు, ప్రైవేటు ఆసుపత్రులకు రూ. 360.16 కోట్ల బకాయి ఉంది. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత నుంచి ఈరోజు వరకు రూ. 2,408.51 కోట్ల ఆరోగ్యశ్రీ నిధులను చెల్లించాం. ఇందులో ప్రభుత్వ ఆసుపత్రులకు రూ. 927.99 కోట్లు, ప్రైవేట్ ఆసుపత్రులకు రూ. 1,480.52 కోట్లు చెల్లించాం. నెలకు ప్రభుత్వ ఆసుపత్రులకు రూ. 34 కోట్లు, ప్రైవేటు ఆసుపత్రులకు రూ. 54 కోట్లు అందించాం'అని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. 'రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద మొత్తం రూ. 725.75 కోట్లు బకాయి ఉంటే, అందులో గత ప్రభుత్వం బకాయి పెట్టిన మొత్తం రూ. 600 కోట్లు. గత ప్రభుత్వ బకాయి పోగా గడిచిన 28 నెలల కాలంలో ఈ ప్రభుత్వ బకాయి కేవలం రూ. 100 కోట్లు మాత్రమే. ఇందులోనూ ప్రభుత్వ ఆసుపత్రులకే ఎక్కువగా రూ. 496.31 కోట్లు బకాయి ఉంటే, ప్రైవేటు ఆసుపత్రులకు రూ. 231.44 కోట్లు ఉంది. రాష్ట్రంలో నిరుపేదలను ఆదుకోవడానికి ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోంది. ప్రభుత్వం పేదల్లో ధీమా కల్పించాలన్న సంకల్పంతోనే 1.15 కోట్ల కుటుంబాలకు జీవిత బీమా తెస్తున్నాం'అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 'రాజీవ్ ఆరోగ్యశ్రీ ఇవ్వకపోవడం వల్ల చికిత్స అందడం లేదన్న వాదన వాస్తవం కాదు. సీఎంఆర్ఎఫ్ గతంలో ఎలా దుర్వినియోగమైందో అందరికీ తెలిసిందే. అందుకని మరింత పారదర్శకంగా ప్రజాప్రతినిధులకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయడానికి వీలు కల్పించాం. నిమ్స్, సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్, వరంగల్ టిమ్స్ వంటి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులతో పాటు 3 వేల కోట్లతో కొత్తగా నిర్మిస్తున్న ఉస్మానియా ఆసుపత్రి కలిపి రాష్ట్రంలో కొత్తగా 10 వేల పడకల సామర్థ్యంతో అత్యాధునికంగా వైద్యం అందించేలా తీర్చిదిద్దుతున్నాం. పనులు వేగంగా జరుగుతున్నాయి. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద పేదలు వైద్యం కోసం టీచింగ్ హాస్పిటల్స్‌కు పంపిస్తే తద్వారా అక్కడున్న నిపుణులైన వైద్యులతో చికిత్స అందించడానికి అలాగే వైద్య విద్యార్థులకు వృత్తిరీత్యా ఎంతో అనుభవం వస్తుంది. చికిత్స అందించే అనుభవం కలిగిన వైద్యులకు ఇన్సెంటివ్స్ కూడా ఇవ్వాలన్న ఆలోచన చేస్తున్నాం'అని సీఎం రేవంత్ రెడ్డి సభలో ప్రకటించారు. 'పేదలకు మరింత వేగవంతమైన నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఆసుపత్రుల నిర్వహణ విధానంలో కూడా మార్పులు చేస్తున్నాం. వైద్యులకే హాస్పిటల్ నిర్వహణ బాధ్యత అప్పగించడం వల్ల వైద్యంపై దృష్టి సారించలేని పరిస్థితులు ఉంటున్నాయి. అందుకని నిర్వహణ విభాగాన్ని వేరు చేయాలన్న ఆలోచన చేస్తున్నాం. విదేశాల్లో గొప్ప పేరు గడించిన వైద్యులు తల్లిదండ్రుల కోసమో, ఇతర పనుల కోసం రాష్ట్రానికి వచ్చినప్పుడు వెసులుబాటును బట్టి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా పేదలకు వారి సేవలను అందించడానికి వీలుగా మెడికల్ అండ్ హెల్త్ వెబ్‌సైట్ ద్వారా ఒక వేదికను క్రియేట్ చేస్తున్నాం' అని పేర్కొన్నారు.

# బంకుల్లోనే పడిగాపులు

మొదటి పేజీ తరువాయి

లేదని పేర్కొంది. 60 రోజుల వరకు సరిపడా నిల్వలు ఉన్నాయని వెల్లడించింది. ఈ మేరకు కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ గురువారం రోజు ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ మేరకు ట్విట్టర్‌లో కూడా పేర్కొంది. పెట్రోల్, డీజిల్ సహా ఎల్‌పీజీకి కొరత ఉందని జరుగుతున్న ప్రచారాన్ని కూడా కొట్టిపారేసింది. తప్పుదోవ పట్టించేలా ప్రచారం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేసిన కేంద్రం.. ఇలాంటివి అస్సలు నమ్మొద్దని పేర్కొంది. భారతదేశంలో ప్రస్తుతం ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద రిఫైనర్ అని.. ఇంకా ఐదో అతిపెద్ద పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతిదారుగా ఉందని వెల్లడించింది. ఇప్పుడు దేశీయంగా తగినంత సరఫరా ఉండటమే కాకుండా ఇంకా 150కిపైగా దేశాలకు భారత్.. శుద్ధి చేసిన ఇంధనాల్ని సరఫరా చేస్తోందని ప్రకటనలో పేర్కొంది. దేశంలోని అన్ని రిఫైనరీలు వంద శాతం ఉత్పాదకత సామర్థ్యంతో పనిచేస్తున్నట్లు నొక్కిచెప్పింది. చమురు కంపెనీల దగ్గర ప్రస్తుతం రాబోయే 60 రోజుల వరకు సరిపడా క్రూడాయిల్ ఉందని తెలిపిన కేంద్రం.. వ్యూహాత్మక నిల్వలతో కలిపి మొత్తం 74 రోజులకు సరిపడినంత చమురు నిల్వలు ఉన్నట్లు వెల్లడించింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మొదలై ఇప్పటికి 27 రోజులు మాత్రమే అయిందని పేర్కొంది. కాబట్టి.. ఇప్పుడు ఎలాంటి భౌగోళిక పరిణామాలతో సంబంధం లేకుండా రానున్న 2 నెలల పాటు స్థిరంగా చమురు సరఫరా చేసేందుకు సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపింది. పెట్రోల్, డీజిల్ సహా ఎల్‌పీజీ నిల్వలు కూడా సరిపడా ఉన్నాయని కేంద్రం స్పష్టం చేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో దేశీయంగా ఉత్పత్తిని కూడా పెంచామని.. దీంతో దిగుమతి చేసుకోవాల్సిన అవసరం కూడా తగ్గినట్లు వెల్లడించింది. ఎల్‌పీజీ కొరత లేకుండా చూసేందుకు వేర్వేరు దేశాల నుంచి కార్గోల్ని కూడా తెప్పిస్తున్నట్లు తెలిపింది. ఇదే సమయంలో ఇంధనం కొరత విషయంలో ఎలాంటి సామాజిక మాధ్యమాల్లో అయినా తప్పుడు, కల్పిత ఆరోపణలు చేస్తే.. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్ర ప్రభుత్వం హెచ్చరించింది.

# ఇరాన్ నేవీ చీఫ్ మృతి

మొదటి పేజీ తరువాయి

ఇరాన్‌కు చెందిన మరో అత్యున్నత అధికారి మరణించినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇరాన్‌కు చెందిన అత్యంత శక్తివంతమైన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డు కోర్(ఐఆర్‌జీసీ)లో భాగమైన నౌకాదళానికి సారథ్యం వహిస్తున్న తంగ్‌సీరీ బంద్ అబ్బాస్‌లో జరిగిన వైమానిక దాడిలో మరణించినట్లు ఇజ్రాయెల్ అధికారి తెలిపారు. హొర్ముజ్ జలసంధి మూసివేతను పర్యవేక్షించే బాధ్యతను కమాండర్ తంగ్‌సీరీ నిర్వహిస్తున్నట్లు ఆ అధికారి చెప్పారు. అయితే ఈ వార్తను ఇరాన్ ఇప్పటివరకు ధృవీకరించలేదు. ఇజ్రాయెలీ రక్షణ దళాలు కూడా దాడిపై స్పందించలేదు. కీలకమైన పర్షియన్ గల్ఫ్‌లోని దాని నావికా కార్యకలాపాలకు గట్టి దెబ్బ అవుతుంది.

# అసెంబ్లీ.. ఆటలా?

మొదటి పేజీ తరువాయి

మంత్రి కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలపై బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. సాగునీటి వంటి అత్యంత ముఖ్యమైన సబ్జెక్టులపై సభలో లోతైన చర్చ జరగాల్సి ఉందని.. కానీ ప్రభుత్వం మాత్రం పద్దులపై చర్చను త్వరగా ముగించి పారిపోవాలని చూస్తోందని విమర్శించారు. కీలకమైన అంశాలపై చర్చలు జరగాల్సిన సమయంలో ఎమ్మెల్యేలు ఆటలు ఆడుతుంటే ప్రజలు ఏమనుకుంటారని ప్రశ్నించారు. ఈ నెల 28, 29 తేదీల్లో ప్రజాప్రతినిధులకు క్రీడా పోటీలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించడంపై మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాల కాలాన్ని ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగించకుండా.. ఇలాంటి కార్యక్రమాలతో కాలయాపన చేయడం సరికాదని తప్పుబట్టారు. పద్దులపై చర్చకు తగినంత సమయం కేటాయించకుండా క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వడం ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రశ్నిస్తోందని పేర్కొన్నారు. చర్చించాల్సిన కీలకమైన అంశాలు పక్కనపెట్టి ప్రతిపక్షాలు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేక క్రీడా పోటీలను ఒక సాకుగా చూపిస్తోందని కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు.



# నేడు శ్రీరామనవమి శోభాయాత్ర.. ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్, మార్చి 26 (ఈవార్తలు): శ్రీరామనవమి సందర్భంగా శుక్రవారం హైదరాబాద్ నగరంలో శోభాయాత్ర నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో నగరంలోని పలుచోట్ల ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి. సీతారాంబాగ్ దేవాలయం నుంచి కోఠిలోని హనుమాన్ వ్యాయామశాల వరకు శోభాయాత్ర నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో రేపు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి. ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉన్న మార్గాల్లో వాహనాలకు అనుమతి ఉండదు. ట్రాఫిక్‌ను ఇతర మార్గాలకు మళ్లిస్తారు.

**ట్రాఫిక్ మళ్లింపు ఇలా..**

సీతారాంబాగ్, బోయిగూడ కమాన్ నుంచి మల్లేపల్లి క్రాస్ రోడ్స్ వైపు మళ్లించనున్నారు.

మంగళ్‌హాట్, గాంధీ విగ్రహం, పురానాపూల్, జుమేరాత్ బజార్ నుంచి వచ్చే వాహనాలను టక్కర్‌వాడి జంక్షన్ వైపు మళ్లిస్తారు.

ఎంజే బ్రిడ్జి, బేగంబజార్, అఫ్జల్‌గంజ్, సిటీ కాలేజీ వైపు వెళ్లే వాహనాలను జుమేరాత్ బజార్ మీదుగా మళ్లిస్తారు.

అబిడ్స్ జీపీవో, సుల్తాన్‌బజార్, కోఠి, అబిడ్స్ ప్రధాన రోడ్ల వద్ద ట్రాఫిక్‌ను నిలిపివేయనున్నారు.

## స్పీకర్ ట్రైబ్యునల్, ఇద్దరు ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, మార్చి 26 (ఈవార్తలు): తెలంగాణ స్పీకర్ ట్రైబ్యునల్‌కు రాష్ట్ర హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఎమ్మెల్యేల అనర్హత విషయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ క్రమంలో స్పీకర్ ట్రైబ్యునల్‌తో పాటు అనర్హత ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, సంజయ్ కుమార్‌కు కూడా నోటీసులు జారీ చేసింది. పార్టీ మారిన ఇద్దరు ఎమ్మెల్యేలపై సభాపతి ట్రైబ్యునల్ చర్యలు తీసుకోలేదని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది కోర్టుకు వివరించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వారు బీఆర్ఎస్ నుంచి గెలిచి ఆ తర్వాత కాంగ్రెస్ లోకి మారారని కోర్టుకు తెలిపారు. అయినప్పటికీ స్పీకర్ చర్యలు తీసుకోలేదని అన్నారు. స్పీకర్ ట్రైబ్యునల్ నిర్ణయాన్ని రద్దు చేయాలని కోరారు. అలాగే పార్టీ మారిన ఆ ఇద్దరు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను ఏప్రిల్ 16వ తేదీకి వాయిదా వేసింది.

## రంగనాథ్ రాజకీయం చేస్తున్నారా?

**బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద ఫైర్**

హైదరాబాద్, మార్చి 26 (ఈవార్తలు): హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై బీఆర్ఎస్ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానందగౌడ్ శాసనసభలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగనాథ్ ప్రజల కోసం పనిచేస్తున్నారా లేక రాజకీయం చేస్తున్నారా అని ప్రశ్నించారు. రంగనాథ్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలను వివేకానందగౌడ్ శాసనసభలో ప్రస్తావించారు. ఒక ఇంటర్వ్యూలో హైడ్రా పనితీరు గురించి మీడియా ప్రతినిధి ప్రశ్నించగా, జూబ్లీహిల్స్ ఉపఎన్నికలు హైడ్రాకు రెఫరెండంగా పేర్కొన్నారు. దీనితో రంగనాథ్ రాజకీయ నాయకుడిలా మాట్లాడుతున్నారని విమర్శలు వెల్లువెత్తాయి. ఈరోజు వివేకానంద గౌడ్ అసెంబ్లీలో మాట్లాడుతూ, రంగనాథ్ మాట్లాడిన ఇంటర్వ్యూను చూసి షాకయ్యానని అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను హైడ్రాకు రెఫరెండంగా ఒక అధికారి చెప్పడమేమిటని ప్రశ్నించారు. ఆయన ప్రజల కోసం పనిచేస్తున్నారా లేక రాజకీయం చేస్తున్నారా అని నిలదీశారు. ఆయనకు రాజకీయం చేయాలనే ఆసక్తి అంతగా ఉంటే ఖద్దర్ దుస్తులు వేసుకుంటే సరిపోతుంది కదా అని ఎద్దేవా చేశారు. తమలాంటి రాజకీయ నాయకులు ఈరోజు ఉండి రేపు వెళ్లిపోతారని, కానీ అధికారులు సంవత్సరాల కొద్ది పనిచేస్తారని వివేకానందగౌడ్ తెలిపారు.

## పెట్రో కొరత లేదు: స్టీఫెన్ రవీంద్ర

హైదరాబాద్, మార్చి 26 (ఈవార్తలు): తెలంగాణలో గత కొన్ని రోజులుగా పెట్రోల్ బంకుల వద్ద కనిపిస్తున్న రద్దీ, సోషల్ మీడియాలో వస్తున్న వార్తల నేపథ్యంలో సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర క్లారిటీ ఇచ్చారు. రాష్ట్రంలో రాబోయే 60 రోజులకు సరిపడా పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయని, ప్రజలు కంగారు పడి బంకుల వద్ద క్యూ కట్టాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా వంట గ్యాస్ విషయంలో నిన్న ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 484 ట్రక్కుల సిలిండర్లను డెలివరీ చేయడం జరిగిందని తెలిపారు. పైప్డ్ (పైపు ద్వారా సరఫరా చేసే) నేచురల్ గ్యాస్, వాహనాలకు వాడే సీఎన్‌జీ సరఫరాలో కూడా ఎలాంటి అంతరాయం లేదని ఆయన స్పష్టత ఇచ్చారు. అవసరానికి మించి అడ్వాన్స్‌గా బుకింగ్స్ చేయడం వల్లే సిస్టమ్‌పై అనవసరమైన ఒత్తిడి పెరుగుతోందని, ప్రజలు సంయమనం పాటించాలని కోరారు. ఇంధన నిల్వలను, సరఫరాను నిరంతరం పర్యవేక్షించడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక కంట్రోల్ రూమ్‌ను కూడా ఏర్పాటు చేసిందని తెలిపారు.

# సర్కారీ బడుల్లో చేపల కూర

**కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం**

**అసెంబ్లీలో మంత్రి వాకిటి వెల్లడి**



హైదరాబాద్, మార్చి 26 (ఈవార్తలు): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రేవంత్ రెడ్డి సర్కార్ ఒక తీపి కబురు అందించింది. ఇప్పటికే మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా సన్నబియ్యంతో పాటు పౌష్టికాహారం అందిస్తుండగా, ఇకపై ఆ మెనూలో చేపల కూరను కూడా చేర్చనున్నట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అసెంబ్లీలో వెల్లడించారు. సభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ ఈ ప్రకటన చేశారు. విద్యార్థులకు మరింత నాణ్యమైన పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. "మధ్యాహ్న భోజన పథకంలో చేపల కూరను అందిస్తాం. ఈ అంశంపై ఇప్పటికే కేబినెట్‌లో చర్చించాం" అని ఆయన వివరించారు. పిల్లల భద్రతను దృష్టిలో ఉంచుకుని, వారి కోసం ప్రత్యేకంగా 'తిలాపియా' అనే జాతి చేపలను పెంచనున్నట్లు మంత్రి తెలిపారు. "ఈ చేపకు మధ్యలో ఒక్కటే వెన్నుముల్లు ఉంటుంది. కాబట్టి పిల్లలు ఎలాంటి ఇబ్బంది లేకుండా తినవచ్చు. వీటిని ప్రత్యేకంగా పెంచి విద్యార్థులకు అందిస్తాం" అని శ్రీహరి పేర్కొన్నారు. రాష్ట్రంలో బలమైన పశుసంపద ఉందని, గుడ్ల ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని ఆయన గుర్తుచేశారు. అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడంతో పాటు, గ్రామస్థాయిలో క్రీడలను బలోపేతం చేసేందుకు కూడా ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని మంత్రి తెలిపారు.

## దావోస్‌తో 2.19 లక్షల కోట్ల పెట్టుబడులు

హైదరాబాద్, మార్చి 26 (ఈవార్తలు): దావోస్ పర్యటన ద్వారా తెలంగాణ రాష్ట్రానికి రూ.2.19 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. ప్రభుత్వం పెట్టుబడిదారులతో 44 ఎంవోయూలను కుదుర్చుకుందని తెలిపారు. ఈ ఒప్పందాలపై శ్వేతపత్రం విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. దావోస్ పెట్టుబడులు, ఎంవోయూలపై శాసనసభలో విపక్ష సభ్యులు అడిగిన ప్రశ్నలు, విమర్శలకు మంత్రి సమాధానం ఇచ్చారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకువస్తుంటే విపక్షాలు ఓర్వలేక విషప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. స్వార్థ రాజకీయాల కోసం చేసే ఆరోపణలు రాష్ట్ర అభివృద్ధికి విఘాతం కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. దావోస్ పర్యటనలో కుదుర్చుకున్న ఒప్పందాల ద్వారా 68,150 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. ఒప్పందాల ద్వారా బహుళ ప్రయోజనాలు, పెద్ద ఎత్తున ఉద్యోగాలు వస్తాయని అన్నారు.

## బీసీలకు రూ.3 కోట్లేనా?: తలసాని

హైదరాబాద్, మార్చి 26 (ఈవార్తలు): తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా బీసీ సంక్షేమంపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం జరిగింది. బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ, అంతకు ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గన్ పార్క్ వద్ద ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రతి ఏటా బీసీల కోసం రూ. 20,000 కోట్లు ఖర్చు చేస్తామని కామారెడ్డి డిక్లరేషన్‌లో చెప్పిన కాంగ్రెస్, ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని తలసాని మండిపడ్డారు. బీసీ సబ్ ప్లాన్ కు మొదటి ఏడాది రూ. 800 కోట్లు చేస్తామన్నారు... రెండో ఏడాది రూ. 11,000 కోట్లు కేటాయించి, క్షేత్రస్థాయిలో కేవలం రూ. 3 కోట్లు మాత్రమే ఖర్చు చేయడం బీసీలను అవమానించడమేనని ఆయన ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్యను తీసుకొచ్చి అబద్ధపు హామీలు ఇప్పించి బీసీల ఓట్లు దండుకున్నారని విమర్శించారు. బీసీ విద్యార్థుల కోసం విదేశీ విద్య, గురుకులాలు, కులవృత్తుల ప్రోత్సాహానికి కేసీఆర్ గారు చేసిన కృషిని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. లింగయ్య యాదవ్ వంటి నేతలకు రాజ్యసభ అవకాశం ఇచ్చి బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించామన్నారు.

## బెంగళూరు ముందు హైదరాబాద్ ఎంత?

**మా సిటీతో తెలంగాణ రాజధానికి పోటీనా?**

**కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే వ్యాఖ్యలు**

బెంగళూరు: బెంగళూరు నగరాన్ని హైదరాబాద్‌తో పోల్చవద్దని, ఈ రెండు నగరాల మధ్య పోలిక సరికాదని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. ప్రపంచ టెక్ హబ్స్ జాబితాలో 6వ స్థానంలో ఉన్న బెంగళూరును, 26వ స్థానంలో ఉన్న హైదరాబాద్‌తో పోల్చడం తగదని ఆయన అన్నారు. గురువారం నాడు కర్ణాటక శాసనసభలో బెంగళూరు అభివృద్ధిపై జరిగిన చర్చలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "ఇటీవల విడుదలైన ఒక నివేదిక ప్రకారం, ప్రపంచంలోని టాప్ 10 టెక్ హబ్స్‌లో బెంగళూరు ఒకటిగా నిలిచింది. ఈ జాబితాలో శాన్ ఫ్రాన్సిస్కో మొదటి స్థానంలో, లండన్ రెండో స్థానంలో ఉన్నాయి. 5వ స్థానంలో ఉన్న బీజింగ్ తర్వాత బెంగళూరు 6వ స్థానాన్ని దక్కించుకుంది. హైదరాబాద్ 26వ స్థానంలో ఉంది. అందుకే, హైదరాబాద్‌తో పోటీ పడాలని నేను అనుకోవడం లేదు" అని శివకుమార్ వివరించారు. ఈ చర్చలో మాజీ ఉప ముఖ్యమంత్రి సీఎన్ అశ్వత్ నారాయణ్ జోక్యం చేసుకుంటూ, దేశంలో బెంగళూరుతో పోల్చదగిన నగరం మరొకటి లేదన్నారు. జీవన వ్యయం విషయంలో హైదరాబాద్ 50 శాతం తక్కువగా ఉండొచ్చని, కానీ బెంగళూరులో ఉన్న ప్రతిభ, కాస్మోపాలిటన్ సంస్కృతి మరెక్కడా లేవని తెలిపారు. బెంగళూరు అభివృద్ధిలో ప్రభుత్వాల పాత్ర నామమాత్రమేనని ఆయన అభిప్రాయపడ్డారు. దీనిపై ఆరోగ్య మంత్రి దినేశ్ గుండూరావు స్పందిస్తూ.. ప్రభుత్వ రంగ సంస్థలు, విద్యాసంస్థలను ఏర్పాటు చేయడం వల్లే బెంగళూరుకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందని, అదే ఐటీ విప్లవానికి బాటలు వేసిందని అన్నారు. ప్రతిపక్ష నేత ఆర్. అశోక్ మాట్లాడుతూ, మీడియానే రెండు నగరాలను పోలుస్తోందని, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున ఈ విషయం రాజకీయంగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. డీకే శివకుమార్ బెంగళూరు ఘనతను వివరిస్తూ.. నగరంలో 26 లక్షల మంది ఐటీ నిపుణులు, 400 ఫార్చ్యూన్ 500 కంపెనీలు, 250 ఇంజనీరింగ్ కాలేజీలు ఉన్నాయని తెలిపారు. అమెరికాలోని సిలికాన్ వ్యాలీలో 13.5 లక్షల మంది ఇంజనీర్లు ఉంటే, ఒక్క బెంగళూరులోనే 26 లక్షల మంది ఉన్నారని, ఇదే బెంగళూరు బలమని అన్నారు. బెంగళూరు తనకు సర్వస్వం ఇచ్చిందని, నగరాభివృద్ధికి అందరూ సహకరించాలని ఆయన కోరారు.

## మేం వీఐపీలం... క్యూలో నిలబడం

**ఐపీఎల్ టికెట్ల కోసం కర్ణాటక ఎమ్మెల్యేల డిమాండ్**

బెంగళూరు: ఐపీఎల్ సందడి మొదలైన వేళ, కర్ణాటకలో ఓ ఆసక్తికరమైన చర్చ మొదలైంది. వీఐపీ కోటాలో తమకు ఐపీఎల్ మ్యాచ్‌ల టికెట్లు కేటాయించాలని ఎమ్మెల్యేలు శాసనసభ వేదికగా డిమాండ్ చేశారు. తాము ప్రజాప్రతినిధులమని, సామాన్యుల్లా క్యూలో నిలబడి టికెట్లు కొనలేమని వారు స్పష్టం చేశారు. మార్చి 28న బెంగళూరులో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య మ్యాచ్ జరగనున్న నేపథ్యంలో ఈ డిమాండ్ తెరపైకి వచ్చింది. ఈ అంశాన్ని కాంగ్రెస్ ఎమ్మెల్యే విజయానంద్ కాశపనవర్ సభలో బలంగా ప్రస్తావించారు. ప్రభుత్వం నుంచి అన్ని సౌకర్యాలు పొందుతున్న కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ (కేఎస్‌సీఏ), ఎమ్మెల్యేలను గౌరవించడం లేదని ఆరోపించారు. "మేము వీఐపీలం. క్యూలో నిలబడడం మావల్ల కాదు" అని తేల్చిచెప్పారు. ప్రతి ఎమ్మెల్యేకు కనీసం ఐదు టికెట్లు ఇవ్వాలని, ప్రత్యేక సీటింగ్ ఏర్పాటు విపక్ష బీజేపీ నుంచి కూడా మద్దతు లభించింది. ప్రతిపక్ష నేత ఆర్. అశోక్ మాట్లాడుతూ, ప్రభుత్వం నుంచి నామమాత్రపు ధరకు భూమి కోట్లు సంపాదిస్తోందని విమర్శించారు.

## ఖలిస్థాన్ ఆగడాలకు కెనడా అడ్డుకట్ట

**కీలక బిల్లుకు హౌస్ ఆఫ్ కామన్స్ ఆమోదం**

ఒట్టావా: కెనడా చట్టసభ కీలక బిల్లుకు ఆమోదం తెలిపింది. విద్వేషపూరిత చర్యలు, నేరాలను అరికట్టేందుకు తీసుకొచ్చిన కంబాటింగ్ హేట్ (సీ9 బిల్లు) బిల్లుకు ఆ దేశ చట్టసభ ఆమోదం తెలిపింది. ఈ కీలక బిల్లుకు హౌస్ ఆఫ్ కామన్స్ ఆమోదముద్ర వేయగా, అనంతరం దీనిని ఎగువసభకు పంపించారు. ఇది అమలులోకి వస్తే ప్రార్థనా స్థలాలపై దాడులు, ఖలిస్థానీ మద్దతుదారుల ఆగడాలకు అడ్డుకట్ట పడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చట్టం ప్రకారం విద్వేష చిహ్నాలను బహిరంగంగా ప్రదర్శించడాన్ని నేరంగా పరిగణిస్తారు. ఈ చట్టం కోసం కెనడాలోని భారత సంతతి వ్యక్తులు సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్నారు. కెనడాలో ఖలిస్థానీల ఆగడాలు పెరిగిపోయిన విషయం తెలిసిందే. కొన్ని వర్గాల వారిని లక్ష్యంగా చేసుకుంటూ బెదిరింపులకు పాల్పడుతుండటం, విధ్వంసం సృష్టించడం తదితర ఘటనలు పెరుగుతున్నాయి. ఇలాంటి ఘటనలపై అక్కడి భారతీయులు చాలా ఏళ్లుగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి తరుణంలో విద్వేష చర్యలకు సంబంధించి కొత్త బిల్లు ఆమోదం పొందడం గమనార్హం.


**మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!**

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## మంత్రి పదవి.. 5 సీబీఐ కేసులు


**కాంగ్రెస్‌పై సబిత మండిపాటు**



హైదరాబాద్, మార్చి 26 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర మంత్రి సీతక్కపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి శాసనసభలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తనకు కాంగ్రెస్ పార్టీ చేసిన మంచితో పాటు చెడును కూడా చెబుతానని అన్నారు. తాను కాంగ్రెస్ పార్టీకి ఎంతో సేవ చేశానని, ఆ పార్టీ తనకు మంత్రి పదవి ఇచ్చిందని, అలాగే 5 సీబీఐ కేసులు కూడా పెట్టిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సీతక్క... కేసీఆర్ కుటుంబాన్ని, తనను పదేపదే తిడుతున్నారని ఆరోపించారు. అలా చేస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతోషపడతారేమో... అందుకే తమను లక్ష్యంగా చేసుకున్నట్లుగా ఉందని విమర్శించారు. సీతక్క కాంగ్రెస్ పార్టీలోనే పుట్టి పెరిగినట్లు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. తన మీద రేవంత్ రెడ్డి కామెంట్ చేసేవరకు తాను ఎప్పుడూ కాంగ్రెస్ పార్టీ గురించి మాట్లాడలేదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు ఆ పార్టీకి మేం సేవలు చేయలేదా అని ప్రశ్నించారు. పార్టీ చేసిన మంచితో పాటు చెడును కూడా చెబుతామని అన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబాన్ని దెబ్బతీయడానికి తనపై ఐదు సీబీఐ కేసులు పెట్టారని ఆరోపించారు. ఆ రోజు తాను ఒక్కమాట మాట్లాడలేదని అన్నారు. తనకు టిక్కెట్ ఇవ్వని సమయంలోనూ మాట్లాడలేదని తెలిపారు. వ్యక్తిగతంగా తమను లక్ష్యంగా చేసుకోవడానికి వారికి చాలా వేదికలు ఉన్నాయని, కానీ శాసనసభలో ప్రజాసమస్యలపై మాట్లాడుదామని అన్నారు. ఈరోజు ముఖ్యమంత్రి తన గురించి మాట్లాడారని, అందుకే తాను కాంగ్రెస్ గురించి మాట్లాడవలసి వస్తోందని అన్నారు.

## సీఎస్ఆర్ నిధులు రావాల్సిందే

**సీఎం రేవంత్ రెడ్డి స్పష్టీకరణ**



హైదరాబాద్, మార్చి 26 (ఈవార్తలు): ఇప్పటివరకు వచ్చిన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) నిధులు ఆశించినస్థాయిలో లేవని, తెలంగాణలో కంపెనీలను ఏర్పాటు చేసి, సీఎస్ఆర్ నిధులను వేరేచోట ఖర్చు పెడితే ఎలా అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రానికి మరిన్ని నిధులు రావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలోని కార్పొరేట్ సంస్థలు, పరిశ్రమలు ఇచ్చే నిధులు వినియోగమయ్యేలా చూడాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు అధికారులతో సమావేశమయ్యారు. సీఎస్ఆర్ నిధుల సమీకరణతో పాటు, వాటిని సమర్థంగా వినియోగించేందుకు ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సీఎస్ఆర్ నిధులతో రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టే కార్పొరేట్ సంస్థలను ప్రభుత్వం తరఫున అభినందించాలని సూచించారు. రాష్ట్రస్థాయిలో సీఎస్ఆర్ సెల్ ఏర్పాటు చేయాలని అన్నారు. రాష్ట్రంలోని కార్పొరేట్ కంపెనీలు సీఎస్ఆర్ నిధులతో చేపడుతున్న కార్యక్రమాల వివరాలు, సీఎస్ఆర్ ద్వారా చేపట్టేందుకు వీలున్న కార్యక్రమాల వివరాలను సమన్వయం చేసే బాధ్యత ఈ సెల్ నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వానికి, కార్పొరేట్ సంస్థలకు అనుసంధానంగా ఉండేలా సీఎస్ఆర్ పోర్టల్‌ను సిద్ధం చేయాలని అన్నారు. వివిధ రాష్ట్రాల్లో సీఎస్ఆర్ నిధుల సమీకరణకు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని అన్నారు.

# నిజాంపేట్, పేట్ బషీరాబాద్ స్థలాలే కేటాయించాలి

**మోసం చేసిన కమిటీ పెద్దలపై విచారణ జరిపి శిక్షించాలి**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జెఎన్‌జేహెచ్ఎస్ సభ్యుల విజ్ఞప్తి**



సోమాజిగూడ–హైదరాబాద్, మార్చి 26 (ఈవార్తలు): వెయ్యి మంది జర్నలిస్టుల కుటుంబాలను రోడ్డున పడేసే కమిటీ పెద్దల కుట్రలపై విచారణ జరిపించాలని... పేట్ బషీరాబాద్, నిజాంపేట్ స్థలాలనే కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టు హౌజింగ్ సొసైటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్టు హౌజింగ్ సొసైటీ సభ్యులు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. 16 ఏళ్ల నుంచి తాము పడుతున్న కష్టాలను మీడియా ముందు వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీరే మాకు దిక్కంటూ వేడుకున్నారు. సొసైటీ ఏర్పడిన నాటి నుంచి సభ్యులను కమిటీ పెద్దలు మభ్యపెడుతూ కుట్రలకు పాల్పడ్డారని.. ప్రభుత్వాలు ఇచ్చిన నిజాంపేట్, పేట్ బషీరాబాద్ స్థలాలను కుట్రపూరితంగా డెవలప్ చేయకుండా అక్రమాలకు పాల్పడ్డారని జెఎన్‌జె హెచ్ ఎస్ సభ్యులు ఆరోపించారు. నిజాంపేట్, పేట్ బషీరాబాద్ స్థలాల్లో అక్రమ కట్టడాల వెనకాల అప్పటి కమిటీ పెద్దలు ఉన్నారని, వారిపై విచారణ చేపడితే వారి మోసాలన్నీ బయటకు వస్తాయన్నారు. 2008లో జెఎన్‌జె సొసైటీ ఏర్పడిన తర్వాత ఒక్కక్కరి నుండి 2లక్షల చొప్పున దాదాపు 23 కోట్ల రూపాయలు వసూలు చేశారని, అందులో 12.33 కోట్ల రూపాయలు మాత్రమే ప్రభుత్వ ఖజానాకు జమ చేశారన్నారు. అప్పటి నుండి సభ్యుల డబ్బులను దుబారా చేయడమే కాకుండా...ఎలాంటి జీబీలు, సమావేశాలు, ఎన్నికలు నిర్వహించకుండా ఏకపక్షంగా సొసైటీని నడిపించారని ఆరోపించారు. సభ్యులు అఫిడవిట్ ఇచ్చి స్థలాలు తీసుకోవచ్చని 2010లో హైకోర్టు చక్కని రూలింగ్ ఇచ్చినా... సభ్యులకు తెలియజేయకుండా దాచిపెట్టడమే గాక, కనీసం జీబీ లేకుండా సుప్రీంకోర్టుకు తీసుకెళ్లారని జర్నలిస్టు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. 2017లో డెవలప్ చేసుకోవచ్చని, 2022లో నిర్మాణాలు చేపట్టవచ్చని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా ఆ తీర్పును కాలదోషం పట్టించి సభ్యులను కమిటీ పెద్దలు నిండా ముంచారని తెలిపారు. మరోవైపు నిజాంపేట్ , పేట్ బషీరాబాద్‌లో అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తూ లాభం పొందినట్లు సభ్యులు ఆరోపించారు.

# వరద కాలువలో గోదారమ్మ పరవళ్లు

**ఫలించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృషి**

**గాయత్రి పంపు హౌస్ నుంచి నీటి విడుదల**

**కొండన్నపల్లి వద్ద కాంగ్రెస్ నేతల పూజలు**



చొప్పదండి, మార్చి 26 (ఈవార్తలు): చొప్పదండి నియోజకవర్గం లో రైతులు సాగుచేసిన పంటలు ఎండిపోకుండా చివరి మడి వరకు సాగునీరు అందించి కాపాడుకుంటామని తాను ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం. రెండు రోజుల క్రితం రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిని కలిసి వరద కాలువకు నీటిని విడుదల చేయాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కోరారు. ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు సానుకూలంగా స్పందించిన మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి వరద కాలువకు నీటిని విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంప్ హౌస్ నుండి అధికారులు వరద కాలువకు నీటిని విడుదల చేశారు. పొట్ట దశలో ఉన్న పంటలను కాపాడడానికి గోదారమ్మ వరద కాలువలో పరవళ్ళు తొక్కింది. చొప్పదండి నియోజకవర్గం రైతులకు భరోసా కల్పిస్తూ వరద కాలువ నిండుగా ప్రవహించింది. దీంతో కొండన్నపల్లి కురిక్యాల గ్రామాల మధ్య వరద కాలువ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. వరద కాలువలో పసుపు, కుంకుమ, పువ్వులు చల్లి గోదారమ్మకు స్వాగతం పలికారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సకాలంలో వరద కాలువకు నీటిని విడుదల చేయించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కు కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమాళ్ళ మనోహర్, సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షుడు ముద్దం నగేష్, మాజి సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తీర్మల్ రావు, సర్పంచులు రేండ్ల శ్రీనివాస్, రామిడి రాజిరెడ్డి,బీర్ల ఆనందం, పడాల భాగ్యలక్ష్మి రాజన్న, కాదరి హారిక కనకయ్య,గునుకొండ బాబు,లింగాల లింగయ్య, గుడి రజిని ప్రవీణ్ రెడ్డి, శ్రీనివాస్,దానే అనసూర్య ఒదేలు, లావణ్య తిరుపతి, బాబ లక్ష్మి మధు, కవిత మల్లేశం,దుబ్బాసి బుచ్చయ్య,మేర్గ కొండయ్య,మ్యాక వినోద్, తదితరులు పాల్గొన్నారు.

# నారాయణపూర్‌ను ముంపు గ్రామంగా ప్రకటించాలి



**కొండగట్టు లిఫ్ట్ ఇరిగేషన్ ను పూర్తి చేయాలి**

**రామడుగు మండలంలో రోడ్లకు నిధులివ్వాలి**

**అసెంబ్లీలో సర్కారును కోరిన మేడిపెల్లి సత్యం**

చొప్పదండి/హైదరాబాద్, మార్చి 26 (ఈవార్తలు): చొప్పదండి నియోజకవర్గం లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అసెంబ్లీలో మాట్లాడారు. ఉత్తర తెలంగాణలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయం లో నీటి సమస్య ఉందని. సమస్యను పరిష్కరించడానికి కొండగట్టు లిఫ్ట్ ఇరిగేషన్ ను పూర్తిచేయాలని కోరారు. లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తయితే కొండగట్టుతో పాటు, పక్కనే ఉన్న జేఎన్టీయూ కళాశాల తో పాటు పలు గ్రామాలకు తాగునీటికి ఇబ్బంది ఉండదని సభ దృష్టికి తీసుకువచ్చారు. చొప్పదండి నియోజకవర్గం తో పాటు, వేములవాడ నియోజకవర్గానికి సాగునీరు అందించే నారాయణపూర్ రిజర్వాయర్ నీటితో నింపిన క్రమంలో కట్ట కింద ఉన్న గ్రామస్తులు నిత్యం పాములు, తేళ్లు, విష కీటకాలతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కట్ట ఎత్తు పెంచడంతోపాటు, నారాయణపూర్ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించి పరిహారం అందజేయాలని, నారాయణపూర్ కుడి కాలువను పూర్తిచేయాలని కోరారు. రామడుగు మండలంలోని మోతే రంగసాయిపల్లి, రుద్రారం గ్రామాల రోడ్డు పూర్తిగా దెబ్బతిందని. రోడ్డు మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

# 'రామకృష్ణ' విద్యార్థిని ఉత్తమ ప్రజెంటేషన్

**శాతవాహన వీసీ చేతులమీదుగా అవార్డు**



జగిత్యాల, మార్చి 26 (ఈవార్తలు): శాతవాహన విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో శాతవాహన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన 'వికసిత భారత్ 2047 లక్ష్య సాధనలో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ పాత్ర' అనే రెండు రోజుల జాతీయ సదస్సు ఘనంగా ముగిసింది. ఈ సదస్సులో జగిత్యాలలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థిని సుహానా కౌసర్ అద్భుత ప్రతిభ కనబరిచారు. తొలి రోజు ఆమె ఇచ్చిన ప్రజెంటేషన్‌ను 'ఉత్తమ ప్రజెంటేషన్'గా ఎంపిక చేసి, వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ యూ ఉమేశ్ కుమార్ చేతుల మీదుగా అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. దేశ ఆర్థికాభివృద్ధిలో కామర్స్, మేనేజ్‌మెంట్ రంగాలు కీలకమని పేర్కొన్నారు. ఇలాంటి సదస్సులు విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీస్తాయని, గ్లోబలైజేషన్ వల్ల వచ్చే సవాళ్లను ఎదుర్కొనేలా వారిని తీర్చిదిద్దుతాయని అన్నారు. ఉత్తమ ప్రజెంటేషన్ ఇచ్చిన సుహానా కౌసర్‌తో పాటు, ఆమెను ప్రోత్సహించిన రామకృష్ణ డిగ్రీ కళాశాల అధ్యాపకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కీనోట్ స్పీకర్‌గా విచ్చేసిన భారత కామర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ ప్రొఫెసర్ రవి కుమార్ జాస్తి మాట్లాడుతూ.. ఆధునిక వ్యాపార ధోరణులు, డిజిటల్ మార్పులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డిగ్రీ స్థాయి నుంచే విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథం పెంచడానికి ఇలాంటి సదస్సులు ఎంతో దోహదపడతాయని వక్తలు అభిప్రాయపడ్డారు. సదస్సులో రిజిస్ట్రార్ పీ సతీశ్ కుమార్, కామర్స్ విభాగ డీన్ ఏ రవి, సెమినార్ డైరెక్టర్ డాక్టర్ డీ హరికాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్వో కార్యాలయం ఆకస్మిక తనిఖీ



కథలాపూర్, మార్చి 26 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత గురువారం కథలాపూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ నిర్వహణ విధానం, రికార్డుల సంరక్షణపై సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న అంశాలపై అధికారులతో చర్చిస్తూ మ్యాపింగ్ పనుల పురోగతి, భూసేకరణకు సంబంధించిన వ్యవహారాలు, భూ భారతీ పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను వేగవంతంగా పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. భూ రికార్డుల నిర్వహణ పారదర్శకంగా, సమర్థవంతంగా ఉండాలని సూచించారు. ఆమె వెంట కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, తహసీల్దార్ తదితర అధికారులు ఉన్నారు.

# ఆర్టిసన్ కార్మికుల సమస్యలపై జేఏసీ ధర్నా



జగిత్యాల టౌన్, మార్చి 26 (ఈవార్తలు): ఆర్టిసన్, పీస్‌రేట్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం జగిత్యాల డివిజన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 30న డీఈ కార్యాలయం, వచ్చే నెల 7న కార్పొరేట్ కార్యాలయం, 8న ఎస్ఈ కార్యాలయం ఎదుట నిరసనలు చేపడతామని తెలిపారు. అయినా స్పందన లేకపోతే ఏప్రిల్ 5 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని ప్రకటించారు.

# లక్కీడ్రా పేరుతో మోసం.. ఇద్దరు అరెస్ట్

**రూ.85 వేలు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం**



ధర్మపురి, మార్చి 26 (ఈవార్తలు): అమాయక ప్రజలను మోసం చేస్తూ లక్కీ డ్రా, బంపర్ డ్రాల పేరిట డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను వెల్గటూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.85 వేల నగదు, రెండు సెల్‌ఫోన్లు, కూపన్ బుక్కులు స్వాధీనం చేసుకున్నారు. ధర్మపురి సర్కిల్ ఇన్స్పెక్టర్ రాం నరసింహారెడ్డి మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. బుధవారం లక్కీ డ్రా నిర్వహిస్తున్నారన్న సమాచారం అందడంతో వెల్గటూర్ ఎస్సై ఉదయ్ కుమార్ తన సిబ్బందితో కలిసి రాజారాంపల్లి క్రాస్‌రోడ్డు వద్ద దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మారం మండలం మేడారం గ్రామానికి చెందిన కట్ట రమేష్, ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన కండెం నరేందర్ రెడ్డి అనే ఇద్దరిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి ఒక రిజిస్టర్, 18 కూపన్ బుక్కులు, రెండు సెల్‌ఫోన్లు, రూ.85 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రూ.1016 చెల్లిస్తే లక్కీ డ్రాలో మొదటి బహుమతిగా కియా కారు, రెండో బహుమతిగా టీవీఎస్ బైక్, మూడో బహుమతిగా ఎలక్ట్రిక్ బైక్, నాల్గో బహుమతిగా వాషింగ్ మెషిన్, ఐదో బహుమతిగా రూ.25 వేల నగదు, ఆరవ బహుమతిగా 10 మందికి రూ.10 వేల చొప్పున ఇస్తామని ప్రచారం చేసినట్లు వెల్లడించారు. లక్కీ డ్రా పేరిట ప్రజలను మోసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు. చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న ఎస్సై ఉదయ్ కుమార్‌తో పాటు పోలీస్ సిబ్బందిని సిఐ అభినందించారు.



# లైంగికదాడి కేసులో నిందితుడికి 10 ఏళ్ల జైలు

జగిత్యాల టౌన్, మార్చి 26 (ఈవార్తలు): మహిళపై లైంగిక దాడి, బెదిరింపుల కేసులో నిందితునికి న్యాయస్థానం 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించింది. అదనంగా రూ.6,600 జరిమానా విధిస్తూ గురువారం అదనపు జిల్లా సెషన్స్ జడ్జి నారాయణ తీర్పు వెలువరించారు. గొల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఈ కేసులో దండేపల్లి మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన నరేండ్ల మహేందర్ (29) బాధితురాలిని రహస్యంగా చిత్రీకరించిన వీడియోలతో బెదిరిస్తూ పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు వెల్లడైంది. సోషల్ మీడియాలో వీడియోలు విడుదల చేస్తానని బెదిరింపులకు దిగినట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. కోటేశ్వర్ సమగ్ర దర్యాప్తు నిర్వహించి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బిట్ల నర్సయ్య వాదనలు వినిపించగా, సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు నిందితుడిని దోషిగా తేల్చింది. కేసులో శిక్ష పడేలా కృషి చేసిన విచారణాధికారి, పిపి, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

# డిఫెన్సివ్ డ్రైవింగ్ అత్యవసరం

**జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**




జగిత్యాల టౌన్, మార్చి 26 (ఈవార్తలు): ప్రతి ఒక్కరు డిఫెన్సివ్ డ్రైవింగ్ సంస్కృతిని అలవాటు చేసుకోవాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. గురువారం అరైవ్.. అలైవ్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ట్రాఫిక్ నియమాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో ఇతర ప్రమాదాల కంటే రోడ్డు ప్రమాదాల వల్లనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు జిల్లా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలతో పాటు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు రోడ్డు భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడం, ప్రజల్లో డిఫెన్సివ్ డ్రైవింగ్ సంస్కృతిని పెంపొందించడం ముఖ్య లక్ష్యమని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ వినియోగం, ట్రాఫిక్ నియమాలను పాటించకపోవడం వంటి కారణాల వల్లనే జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడపకూడదనే నిబంధనలు, అతివేగం వల్ల కలిగే ప్రమాదాలు వంటి అంశాలను ప్రభావవంతంగా ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రఘు చందర్, మున్సిపల్ చైర్మన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, ఇన్స్పెక్టర్లు సుధాకర్, కరుణాకర్, ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



# 76 మందికి కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

రాయికల్, మార్చి 26 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో గురువారం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద 76 మంది లబ్ధిదారులకు రూ.76 లక్షల విలువ గల చెక్కులను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పంపిణీ చేశారు. గుడేటి రెడ్డి సంఘం భవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాయికల్ పట్టణం, మండలానికి చెందిన లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక సహాయం అందించేందుకు ఈ పథకాలు ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నాగరాజు, ఎంపీడీవో చిరంజీవి, ఎమ్మార్వో నాగార్జున, మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్, వైస్ చైర్మన్ సౌజన్య శ్రీధర్ రెడ్డి, ఆత్మ ఛైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హనుమండ్లు, మాజీ వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, సర్పంచులు, కౌన్సిలర్లు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కెనాల్‌లో బైక్ పడి ఇద్దరు గల్లంతు

జగిత్యాల, మార్చి 26 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ ఎస్సారెస్పీ కెనాల్‌లో విషాదకర ప్రమాదం చోటుచేసుకుంది. ద్విచక్రవాహనం అదుపుతప్పి కెనాల్‌లో పడిపోవడంతో ఇద్దరు గల్లంతయ్యారు. స్థానికుల సమాచారం ప్రకారం ప్రమాద సమయంలో బైక్‌ను యువతి నడుపుతున్నట్లు తెలిసింది. బైక్‌పై యువతి, యువకుడు ఇద్దరూ ప్రయాణిస్తున్న సమయంలో అదుపుతప్పి కెనాల్‌లో పడిపోయారు. దీంతో ఇద్దరూ నీటిలో కొట్టుకుపోయి గల్లంతయ్యారు. గల్లంతైన యువకుడు మెట్‌పల్లి పట్టణంలోని డీడీ నగర్‌కు చెందిన అంకుస్‌గా గుర్తించారు. అతనితో ఉన్న యువతి బోదాసు లావణ్యగా గుర్తించారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు.





# ఇరాన్ నుంచి 10 చమురు ట్యాంకర్ల గిఫ్ట్

వాషింగ్టన్: ఇరాన్ నుంచి తమకు పెద్ద గిఫ్ట్ వచ్చిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఇరాన్ 10 చమురు ట్యాంకర్లను పంపించిందని ఆయన తెలిపారు. హర్మూజ్ జలసంధి గుండా వీటిని పంపించిందని ఆయన పేర్కొన్నారు. ఈ జలసంధి వద్ద ఇరాన్ ఎలాంటి టోల్ ఛార్జీని వసూలు చేయలేదని అన్నారు. ఇరాన్‌తో చర్చలు కొనసాగుతున్నట్లు తెలిపారు. హర్మూజ్ మీదుగా వస్తున్న ఆయా ట్యాంకర్లపై పాకిస్థాన్ జెండాలు ఉన్నట్లు వెల్లడించారు. పశ్చిమాసియాను స్వాధీనం చేసుకోవాలని ఇరాన్ భావించిందని, కానీ తాము అడుగుపెట్టేసరికి వారికి కష్టంగా మారిందని ట్రంప్ అన్నారు. ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, ఒమన్ దేశాలను ఇరాన్ లక్ష్యంగా చేసుకుందని ఆరోపించారు. పశ్చిమాసియాను స్వాధీనం చేసుకోవడానికి ఇరాన్ వద్ద పక్కా ప్రణాళిక ఉందని పేర్కొన్నారు. అందుకే ఆ దేశాల పైకి క్షిపణులను ప్రయోగించిందని అభిప్రాయపడ్డారు. గల్ఫ్ దేశాల పైకి ఇరాన్ ప్రయోగించిన క్షిపణుల్లో కొన్ని యుద్ధం ప్రారంభానికి చాలాకాలం ముందే గురిపెట్టి ఉన్నాయని ట్రంప్ అన్నారు. ఆయుధాలను లోడ్ చేసి దాడులకు సిద్ధంగా ఉంచిందని ఆరోపించారు. అయితే అమెరికా దాడి నేపథ్యంలో అంతా నిర్వీర్యమైందని అన్నారు. ఇరాన్, అమెరికా మధ్య ఒప్పందం కుదిరే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని ట్రంప్ ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్ అన్నారు. యుద్ధాన్ని నిలిపివేసేందుకు రూపొందించిన పదిహేను పాయింట్ల ప్రణాళికను ఇరాన్ ముందు ఉంచినట్లు అమెరికా వెల్లడించింది. ఒప్పందం కుదురుతుందని, ఉద్రిక్తతలు తగ్గుతాయని స్టీవ్ విట్కాఫ్ అభిప్రాయపడ్డారు.



## భార్య జుట్టు పట్టి ఈడ్చి.. కారుతో తొక్కించి

**కర్ణాటకలోని కలబురగిలో దారుణ హత్య**

కలబురగి: కర్ణాటకలో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. కట్టుకున్న భార్యను ఓ భర్త అత్యంత కిరాతకంగా హతమార్చాడు. నడిరోడ్డుపై జుట్టు పట్టుకుని కొట్టి, ఆ తర్వాత కారుతో తొక్కి చంపేశాడు. ఈ అమానవీయ ఘటన కలబురగి జిల్లాలో గురువారం ఉదయం జరిగింది. సీసీటీవీలో రికార్డయిన ఈ దృశ్యాలు అందరినీ దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. వివరాల్లోకి వెళితే, మహారాష్ట్రలోని బరామతికి చెందిన అక్షయ్, షైలా (28) దంపతులు. వీరికి నాలుగేళ్ల క్రితం వివాహమైంది. గురువారం ఉదయం వారు పుణ్యక్షేత్రమైన గణగాపుర వెళ్లేందుకు మారుతి ఎర్టిగా కారులో బయలుదేరారు. కలబురగి సమీపంలోని బల్లూర్గా గ్రామ శివార్లలోకి రాగానే ఉదయం 11 గంటల సమయంలో భార్యాభర్తల మధ్య గొడవ మొదలైంది. దీంతో ఆగ్రహానికి గురైన అక్షయ్, భార్య షైలాను కారులోంచి బయటకు తోసేశాడు. అనంతరం ఆమె జుట్టు పట్టుకుని నడిరోడ్డుపైనే విచక్షణారహితంగా కొట్టాడు. షైలా కేకలు వేయడంతో అటుగా వెళుతున్న వారు జోక్యం చేసుకుని అక్షయ్‌ను అడ్డుకున్నారు. ఆమెను తిరిగి కారులో ఎక్కించారు. అయితే, కాసేపటికే అక్షయ్ కారును సమీపంలోని ఓ పొలం వైపు మళ్లించాడు. అక్కడ మళ్లీ షైలాను బయటకు నెట్టి, ఆమెపై నుంచి కారును నడిపి అతి దారుణంగా చంపేశాడు. భార్య షైలాకు వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతోనే అక్షయ్ ఈ ఘాతుకానికి పాల్పడినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈ ఘటనపై కలబురగి ఎస్పీ అద్దూరు శ్రీనివాసులు మాట్లాడుతూ, "నిందితుడిని అరెస్ట్ చేశాం. అన్ని కోణాల్లోనూ కేసును దర్యాప్తు చేస్తున్నాం" అని తెలిపారు. పోలీసులు అక్షయ్‌పై కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నారు.

## బీజేపీ నుంచి ఆర్జీ కర్ మృతురాలి తల్లి పోటీ

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో, బీజేపీ 19 మంది అభ్యర్థులతో మూడవ జాబితాను విడుదల చేసింది. 2024లో కోల్‌కతాలోని ఆర్జీ కర్ ఆసుపత్రిలో హత్యాచారానికి గురైన ట్రైనీ డాక్టర్ తల్లికి బీజేపీ టిక్కెట్ ఇచ్చింది. ఆమెను పానీహటి అసెంబ్లీ నియోజవర్గం నుంచి బీజేపీ బరిలోకి దింపుతోంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తాను బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నట్లు తెలిపారు. తాను గెలిస్తే పానిహటీ ప్రజలు గెలిచినట్లేనని ఆమె అన్నారు. నిరసనలు తెలపడం మరిచిపోయినవారి కోసం తాను గొంతుకనవుతానని అన్నారు. నియోజకవర్గం అభివృద్ధికి, ప్రజలకు సేవ చేయడానికి తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో పోటీ చేయడం గర్వకారణం కాదని, అది ఒక బాధ్యత అన్నారు. తాను ప్రజలకు సేవచేయగలిగితే తన కూతురు సంతోషిస్తుందని అన్నారు. పశ్చిమ బెంగాల్ అంతటా కమలం వికసించాలని ఆకాంక్షించారు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీని కూకటివేళ్లతో పెకిలించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 2024 ఆగస్ట్ 9న కోల్‌కతాలోని ఆర్జీ కర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో రాత్రి విధుల్లో ఉన్న 31 సంవత్సరాల పీజీ విద్యార్థినిపై హత్యాచారం జరిగింది. ఈ సంఘటనపై దేశ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. బెంగాల్‌లో నెలకు పైగా వైద్యుల నిరసనలు కొనసాగాయి. హత్యాచారం కేసు దర్యాప్తుపై బాధితురాలి తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేశారు. సాక్ష్యాలను తారుమారు చేశారని ఆరోపించారు. ఇటీవలే వారు బీజేపీలో చేరారు. ఆర్జీ కర్ బాధితురాలి తల్లి బీజేపీ నుంచి పోటీ చేయడంపై తృణమూల్ కాంగ్రెస్ స్పందించింది. ఎన్నికల్లో పోటీ చేసే ప్రజాస్వామ్య హక్కు ఆమెకు ఉందని పార్టీ సీనియర్ నేత కునాల్ ఘోష్ అన్నారు.

# కిమ్‌కు తుపాకీ గిఫ్ట్!

**శత్రువులు కనిపిస్తే వాడండి.. బెలారస్ అధ్యక్షుడు సరదా వ్యాఖ్యలు**



ప్యాంగ్యాంగ్: ఉత్తర కొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్‌కు బెలారస్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకాషెంకో ఓ ఆటోమేటిక్ రైఫిల్‌ను బహుమతిగా ఇచ్చారు. ప్యాంగ్యాంగ్‌లో తొలిసారి పర్యటించిన లుకాషెంకో.. 'శత్రువులు కనిపిస్తే అవసరం పడుతుంది' అని ఈ సందర్భంగా సరదాగా వ్యాఖ్యానించారు. ఈ భేటీకి సంబంధించిన వివరాలను బెలారస్ అధికారిక మీడియా గురువారం వెల్లడించింది. ఈ పర్యటన సందర్భంగా ఇరు నేతలు 'స్నేహం, సహకారం' ఒప్పందంపై సంతకాలు చేశారు. బెలారస్ మీడియా విడుదల చేసిన వీడియోలో.. లుకాషెంకో రైఫిల్‌ను కిమ్‌కు అందిస్తుండగా, దానిని అందుకున్న కిమ్ మాక్ రీలోడింగ్ చేసినట్టు సైగ చేసి "థాంక్యూ" చెప్పారు. దీనికి లుకాషెంకో "అవును, శత్రువులు కనిపిస్తే ఉపయోగపడుతుంది" అనడంతో కిమ్ నవ్వారు. ప్రతిగా కిమ్ జాంగ్ ఉన్ కూడా లుకాషెంకోకు ఒక ప్రత్యేక బహుమతి ఇచ్చారు. సుమారు 30 సముద్రపు గుల్లలతో తయారు చేసిన, లుకాషెంకో చిత్రం ఉన్న ఒక మొజాయిక్ ఫ్లవర్ వాజ్‌ను బహూకరించారు. ఈ సమావేశంలో ఇద్దరు నేతలు పశ్చిమ దేశాలపై విమర్శలు గుప్పించారు. బెలారస్‌పై పశ్చిమ దేశాలు విధిస్తున్న 'అక్రమ ఒత్తిడి'ని ఉత్తర కొరియా వ్యతిరేకిస్తోందని కిమ్ స్పష్టం చేశారు. అంతర్జాతీయ చట్టాలను కొన్ని ప్రపంచ శక్తులు ఉల్లంఘిస్తున్నాయని లుకాషెంకో ఆరోపించారు. ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యాకు ఈ రెండు దేశాలు మద్దతుగా నిలుస్తున్న విషయం తెలిసిందే. రష్యాకు ఉత్తర కొరియా ఆయుధాలు సరఫరా చేస్తుండగా, 2022లో దాడికి బెలారస్ తన భూభాగాన్ని లాంచ్‌ప్యాడ్‌గా ఉపయోగించుకునేందుకు అనుమతించింది. పశ్చిమ దేశాల ఆధిపత్యాన్ని సవాలు చేస్తూ రష్యా, చైనాలతో కలిసి 'బహుళ ధ్రువ ప్రపంచం' కోసం పనిచేస్తున్నామని ఇరు నేతలు పునరుద్ఘాటించారు. పర్యటన ముగింపులో కిమ్ స్వయంగా విమానాశ్రయం వరకు వచ్చి లుకాషెంకోకు ఆత్మీయ వీడ్కోలు పలికారు.

# కొన్నది లేదు.. చేసింది లేదు!


**ఇరాన్ చమురు కొనుగోలు వార్తలపై రిలయన్స్ క్లారిటీ**



ముంబై: ఇరాన్ నుంచి ముడి చమురు కొనుగోలు చేసినట్లు తమపై వస్తున్న వార్తలను రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) తీవ్రంగా ఖండించింది. ఈ కథనాలు పూర్తిగా నిరాధారమైనవి అని కొట్టిపారేసింది. ఈ మేరకు గురువారం ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. సముద్ర మార్గంలో చిక్కుకుపోయిన ఇరాన్ ముడి చమురుపై అమెరికా ప్రభుత్వం తాత్కాలికంగా ఆంక్షలను సడలించడంతో, రిలయన్స్ ఈ అవకాశాన్ని వినియోగించుకుందని పలు మీడియా సంస్థలు కథనాలు ప్రచురించాయి. నేషనల్ ఇరానియన్ ఆయిల్ కంపెనీ నుంచి రిలయన్స్ సుమారు 5 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును కొనుగోలు చేసిందని ఈ కథనాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలోనే రిలయన్స్ స్పందించింది. "ఇరాన్‌కు చెందిన ముడి చమురును కంపెనీ కొనుగోలు చేసిందంటూ ఇటీవలి మీడియా నివేదికలను రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తోంది. ఈ నివేదికలు నిరాధారమైనవి. ప్రజలను తప్పుదారి పట్టించేలా, తప్పుడు వాదనలకు దారితీసేలా ఉన్నాయి" అని కంపెనీ తన ప్రకటనలో స్పష్టం చేసింది. వార్తలను ప్రచురించే ముందు సంబంధిత మీడియా సంస్థలు వాస్తవాలను ధృవీకరించుకోవాలని హితవు పలికింది. గత వారం, అమెరికా ఆర్థిక శాఖ ఓ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే నౌకల్లో నింపి, సముద్రంలో చిక్కుకుపోయిన ఇరాన్ చమురు అమ్మకానికి స్వల్పకాలిక అధికారాన్ని మంజూరు చేసింది. ఈ చర్య ద్వారా ప్రపంచ సరఫరాను వేగంగా పెంచవచ్చని, అదే సమయంలో టెహ్రాన్‌పై ఒత్తిడిని కొనసాగించవచ్చని డొనాల్డ్ ట్రంప్ పరిపాలన యంత్రాంగం భావిస్తున్నట్లు ఆర్థిక శాఖ పేర్కొంది. అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెస్సెంట్ మాట్లాడుతూ, "ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ఇంధన మార్కెట్లను స్థిరీకరించడానికి ఈ చర్య తీసుకున్నాం. మార్చి 20 నాటికి ఇప్పటికే నౌకల్లో లోడ్ చేసిన చమురుకు మాత్రమే ఈ అధికారం వర్తిస్తుంది" అని తెలిపారు. ఏప్రిల్ 19 వరకు ఈ వెసులుబాటు అమల్లో ఉంటుందని ట్రెజరీ జనరల్ లైసెన్స్‌లో పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో సుమారు 140 మిలియన్ బ్యారెళ్ల ఇరాన్ చమురు ప్రపంచ మార్కెట్లలోకి అందుబాటులోకి వస్తుందని, సరఫరాపై ఒత్తిడి తగ్గుతుందని బెస్సెంట్ వివరించారు. ఆంక్షలు విధించిన ఇరాన్ చమురులో ఎక్కువ భాగం చైనా వంటి దేశాలు చౌకగా నిల్వ చేసుకుంటున్నాయని, ఈ తాజా నిర్ణయంతో టెహ్రాన్ ప్రాబల్యాన్ని తగ్గించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పరిణామాల మధ్య తమపై వచ్చిన ఆరోపణలను రిలయన్స్ ఖండించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# అమెరికా గెలవదు.. ఇరాన్ ఓడిపోదు!

పశ్చిమాసియా సంక్షోభంపై బాబా రాందేవ్



న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో యోగా గురు, పతంజలి సహ వ్యవస్థాపకుడు బాబా రాందేవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ యుద్ధంలో అటు అమెరికా గెలవదని, ఇటు ఇరాన్ ఓడిపోదని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచ శాంతి స్థాపనలో భారత్ కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. హరిద్వార్‌లోని పతంజలి యోగపీఠ్‌లో గురువారం జరిగిన రామనవమి వేడుకల సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. "ఈ యుద్ధంలో అమెరికా గెలవదు, ఇరాన్ ఓడిపోదని నేను గతంలోనే చెప్పాను. 1000-1200 కిలోమీటర్ల నుంచి 4000-5000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగల బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించడం ద్వారా, కేవలం ఆయుధాలతో ఎవరూ ఎవరినీ భయపెట్టలేరని ఇరాన్ నిరూపించింది" అని రాందేవ్ విశ్లేషించారు. ప్రజాస్వామ్యం అంటే ఇతరులను భయపెట్టడం కాదని ఆయన హితవు పలికారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా గర్వపడే అమెరికా, ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని కూడా గౌరవించాలని సూచించారు. ఈ సంక్షోభాన్ని పరిష్కరించడంలో భారత్ కీలక పాత్ర పోషించాలని రాందేవ్ ఆకాంక్షించారు. 'వసుధైక కుటుంబం' (ప్రపంచమంతా ఒకే కుటుంబం) అనే సిద్ధాంతం ఆధారంగా ప్రపంచాన్ని ఏకతాటిపైకి తీసుకురావాలన్న సందేశాన్ని భారత్ ఇస్తూనే ఉండాలని ఆయన అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ రాజకీయంగా, దౌత్యపరంగా చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేస్తున్నారని కొనియాడారు. "ఇజ్రాయెల్-అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధాన్ని ఎవరైనా మధ్యవర్తిత్వంతో ఆపగలిగితే అది భారతే. ఈ యుద్ధం వల్ల తలెత్తిన పెట్రోల్, గ్యాస్ సంక్షోభంతో పాటు ప్రపంచ ఆర్థిక మాంద్యానికి కూడా చర్చల ద్వారానే పరిష్కారం లభిస్తుంది. ఇందులో భారత్ కీలక పాత్ర పోషించగలదని నేను విశ్వసిస్తున్నాను" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇదే సమయంలో శ్రీరామనవమి పర్వదినం ప్రాముఖ్యతను వివరిస్తూ, దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. డిజిటల్ మీడియా ప్రభావంతో యువత, ముఖ్యంగా కుమార్తెల శీలం దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పండుగలను పిల్లల్లో మన గొప్ప సాంస్కృతిక వారసత్వంపై బలమైన అవగాహన కల్పించడానికి ఒక అవకాశంగా ఉపయోగించుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. దేశ విదేశాంగ విధానం వంటి జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన విషయాల్లో అందరూ కలిసికట్టుగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.



## సామూహిక వివాహాలకు శ్రీకారం...

భద్రాచలం రామాలయం సాక్షిగా...
శ్రీరామ నవమి పర్వదినాన ప్రభుత్వం ఇచ్చు ప్రతి ఏడాదీ పట్టువస్త్రాల హారతి...
పూజారులు చేసేరు సీతమ్మకు
ముత్యాల తలంబ్రాలతో మంగళధారణ మహోత్సవం

పెళ్ళంటే "నూరేళ్ళ పంట" కలవారికి...
పెళ్లి ఖర్చులు భరించలేని పేదవారికి... పెళ్ళి ఒక కల అది తీరంచేరని ఆశలఅల




ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో భాగంగా...
అధికారుల ఆర్థిక ప్రణాళికతో...
దయార్ద్ర హృదయుల...
దానకర్ణుల సహకారంతో...
శ్రీ సీతారాముల కళ్యాణమహోత్సవంలో
సామూహిక వివాహాలకు శ్రీకారం చుడితే.
ఆ కొత్తజంటల జన్మధన్యమయ్యేను కదా
ఆ ఆదర్శదంపతుల అండతో ఆశీస్సులతో

అది పూజారులకు పుణ్యప్రాప్తి... ధర్మదాతలకు దక్కును కీర్తి కిరీటం...
ఆదర్శ ప్రాయమైన అట్టి... ఆ "సీతారాముల కళ్యాణ వైభోగం"
నిరుపేద కుటుంబాలకొక నిండుజాబిలి...

- పోలయ్య కవి కూకట్లపల్లి హైదరాబాద్

## నాటో.. మిమ్మల్ని మరువను: ట్రంప్



వాషింగ్టన్: ఇరాన్‌తో యుద్ధం విషయంలో నాటో దేశాల నుంచి ఎలాంటి మద్దతు లభించడంలేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్ని రోజుల పాటు జరిగిన యుద్ధంలో ఇరాన్ మిలిటరీ పరంగా ఇప్పటికే తీవ్రంగా నష్టపోయిందని అన్నారు. ఈ దశలో కూడా అమెరికాకు నాటో దేశాల నుంచి ఎలాంటి సహకారం లభించడం లేదని వాపోయారు. వాస్తవానికి ఇప్పటి పరిస్థితుల్లో నాటో దేశాల నుంచి తమకు ఎలాంటి సహకారం అవసరం లేదని ట్రంప్ పేర్కొన్నారు. కానీ ఇలాంటి కీలకమైన సమయాల్లో వారు ప్రవర్తించిన తీరును ఎప్పటికీ మరిచిపోబోమని ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్‌తో యుద్ధానికి ట్రంప్ ఐదురోజుల పాటు విరామం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇరాన్‌తో చర్చల ఫలితాన్ని బట్టి తదుపరి నిర్ణయం ఉంటుందని తెలిపారు.

## మోస్ట్ పాపులర్ నేతగా మోదీ



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన నేతగా మరోసారి నిలిచారు. అమెరికాకు చెందిన ప్రముఖ డేటా అనలిటిక్స్ సంస్థ 'మార్నింగ్ కన్సల్ట్' నిర్వహించిన సర్వేలో ఆయన 68 శాతం అప్రూవల్ రేటింగ్‌తో అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు. మార్చి 2 నుంచి 8వ తేదీ మధ్య ఈ సర్వే నిర్వహించారు. ఈ సర్వే ఫలితాలను బీజేపీ నేతలు స్వాగతిస్తూ, ప్రధానిపై ప్రశంసలు కురిపించారు. ఈ విషయంపై ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య స్పందిస్తూ, "ప్రధాని మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచే ఉత్తమ నేత. ఇప్పుడు ప్రధానిగా ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన నాయకుడిగా కొనసాగుతున్నారు. కేవలం సర్వేల ఆధారంగానే కాకుండా, ఆయన జీవితాంతం చేసిన సేవ వల్లే ఈ గుర్తింపు లభించింది" అని అన్నారు. యూపీ మంత్రి డానిష్ ఆజాద్ అన్సారీ మాట్లాడుతూ, "మోదీ నాయకత్వంలో భారత్ అభివృద్ధిలో కొత్త శిఖరాలను అందుకుంది. ప్రపంచ పురోగతిలో భారత్ కీలక పాత్ర పోషిస్తుందని నిరూపించాం. ఆయన నాయకత్వం వల్లే ప్రపంచ దేశాలతో మన సంబంధాలు బలపడ్డాయి" అని వివరించారు. ఇదే అభిప్రాయాన్ని బీజేపీ ఎంపీ ప్రవీణ్ ఖండేల్వాల్, మహారాష్ట్ర మంత్రి గిరీష్ మహాజన్ కూడా వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ప్రపంచంలోనే అత్యంత ప్రసిద్ధ నాయకుడని, ఆయన పనితీరు దేశానికి గర్వకారణమని వారు కొనియాడారు. ఈ ఘనత సాధించినందుకు ప్రధాని మోదీకి దేశం తరపున అభినందనలు తెలిపారు.

## క్లాస్ రూంలో ప్రొఫెసర్ ప్రపోజ్

**చెప్పుతో కొట్టిన మెడికల్ విద్యార్థిని**

బెంగళూరు: బెంగళూరు శివార్లలోని ఓ ప్రైవేట్ మెడికల్ కాలేజీలో దారుణ ఘటన చోటుచేసుకుంది. తరగతి గదిలో లెక్చర్ చెబుతూనే ఓ విద్యార్థినికి ప్రేమ ప్రతిపాదన చేసిన ప్రొఫెసర్‌పై తోటి విద్యార్థులు దేహశుద్ధి చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర కలకలం రేగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, నెల్లమంగళ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ మెడికల్ కాలేజీలో ఈ సంఘటన జరిగింది. క్లాస్ జరుగుతుండగా, ప్రొఫెసర్ ఓ విద్యార్థినికి చాక్లెట్ అందించి, అందరి ముందే తన ప్రేమను వ్యక్తం చేశారు. "ఈ బ్యాచ్‌లోని చాలా ముఖ్యమైన అమ్మాయికి, మీ అందరికీ చాక్లెట్లు ఇస్తున్నాను... ఐ లవ్ యూ" అని చెప్పినట్లు వీడియోలో రికార్డయింది. దీంతో ఆ విద్యార్థిని వెంటనే అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రొఫెసర్ ప్రవర్తనను ప్రశ్నిస్తూ, తన చెప్పుతో కొట్టింది. ఇతర విద్యార్థులు కూడా ప్రొఫెసర్‌పై క్యాంపస్‌లో దాడి చేశారు. అతనిని కారు వరకు తరిమి చితకబాదారు. వారి నుంచి తప్పించుకున్న ప్రొఫెసర్, అక్కడి నుంచి పరారయ్యాడు. అంతకుముందు క్లాస్‌లో విద్యార్థిని ఎదురుతిరగడంతో, ఆమె కూడా తనకు ప్రపోజ్ చేసిందని, దానికి సీసీటీవీ ఫుటేజీలో ఆధారం ఉందని ప్రొఫెసర్ చెప్పాడు. ఆ ఫుటేజీని వెంటనే చూపించాలని విద్యార్థిని సవాలు చేయడంతో ప్రొఫెసర్ మాట దాటవేశాడు. ఈ ఘటనలో ప్రొఫెసర్, విద్యార్థిని వేర్వేరు వర్గాలకు చెందినవారు కావడంతో అధికారులు కేసును సీరియస్‌గా తీసుకున్నారు.

వయ్యారి చిత్రం



జారా యెస్మిన్







# నేడు పెద్ది స్పెషల్ అప్‌డేట్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ఫ్యాన్స్‌కు ఇప్పుడు పండగే పండగ. బుచ్చిబాబు సనా దర్శకత్వంలో రూపొందుతున్న రామ్ చరణ్ 16వ చిత్రం 'పెద్ది' నుంచి ఒక భారీ అప్‌డేట్ రాబోతోంది. ఇప్పటికే విడుదలైన సాంగ్స్‌తో అంచనాలు పెంచేసిన ఈ సినిమా, ఇప్పుడు శ్రీరామనవమి సందర్భంగా ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. చరణ్ పుట్టినరోజు కానుకగా రాబోతున్న ఈ సినిమా గ్లింప్స్ కోసం మెగా అభిమానులు కళ్ళల్లో ఒత్తులు వేసుకుని మరీ ఎదురుచూస్తున్నారు. రేపు ఉదయం రాబోయే ఆ సర్ప్రైజ్ ఏంటో ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. డైరెక్టర్ బుచ్చిబాబు సనా సోషల్ మీడియా వేదికగా విడుదల చేసిన ఒక పోస్టర్ ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. "చరణ్ బ్యాట్ పట్టడం చూశారు.. కానీ ఇప్పుడు ఆయన గదతో వస్తున్నారు" అంటూ ఆయన ఇచ్చిన హింట్ ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పిస్తోంది. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని రేపు ఉదయం 9.45 గంటలకు ఒక ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ రాబోతోందని మేకర్స్ ప్రకటించారు. ఇది సినిమా గ్లింప్స్ లేదా చరణ్ క్యారెక్టర్‌కు సంబంధించిన టీజర్ అయి ఉంటుందని అంతా భావిస్తున్నారు. ఈ మాస్ రాంపేజ్ బాక్సాఫీస్ వద్ద రికార్డులు తిరగరాయడం ఖాయమని చిత్ర యూనిట్ ధీమాగా ఉంది.

# అంజి సినిమాలో నటించా.. కానీ: నిహారిక



నిహారికకు హీరోయిన్‌గా ఎంట్రీ ఇవ్వకముందే చిన్నతనంలోనే చైల్డ్ ఆర్టిస్ట్‌గా నటించే అవకాశం దక్కింది. మెగాస్టార్ చిరంజీవి నటించిన క్లాసిక్ ఫాంటసీ మూవీ అంజిలో తాను కూడా ఒక చిన్న పాత్రలో కనిపించాల్సి ఉందని వెల్లడించింది. ఈ సినిమాలో పలువురు చైల్డ్ ఆర్టిస్టులు నటించిన సంగతి తెలిసిందే. వారిలో నిహారిక కూడా ఒకరిగా ఎంపికై, కొద్ది రోజుల పాటు షూటింగ్‌లో పాల్గొన్నట్లు నిహారిక రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో తెలిపింది. అయితే, షూటింగ్ ప్రారంభమైన కొన్ని రోజుల తర్వాత కథలో మార్పులు రావడంతో ఆమె పాత్రను పూర్తిగా తొలగించినట్లు నిహారిక వివరించింది. స్టోరీ డెవలప్ అవుతున్న సమయంలో, డైరెక్టర్ కోడి రామకృష్ణ టీమ్ కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుందని, అందులో భాగంగానే ఆర్టిస్టులు చాలా మంది మారిపోయారని, ముఖ్యంగా సినిమాలో కనిపించే పిల్లల పాత్రలకు కొంచెం పెద్ద వయస్సు ఉండాలని, అలాగే డైలాగ్స్ చెప్పగలగాలని డిసైడ్ అయ్యారని, కానీ ఆ టైమ్ లో తాను చాలా చిన్న అమ్మాయి అవడం వల్ల తనకు మాటలు రాలేదని, దీంతో నిహారిక ప్లేస్ లో వేరే అమ్మాయిని ఎంపిక చేసినట్లు వెల్లడించింది.




# 'ఇరుముడి' స్పెషల్ పోస్టర్ రిలీజ్

హిట్, ఫ్లాప్స్‌తో సంబంధం లేకుండా వరుస చిత్రాలు చేస్తున్న మాస్ మహారాజా రవితేజ ఈ ఏడాది 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'తో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. సంక్రాంతి స్పెషల్‌గా రిలీజైన ఈ చిత్రం పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. ఈ సినిమా సక్సెస్ తర్వాత రవితేజ తన 77వ చిత్రంపై ఫోకస్ పెట్టాడు. 'ఇరుముడి' అనే పవర్‌ఫుల్ టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్నాడు. యాక్షన్ రివేంజ్ డ్రామాగా రూపొందుతోన్న ఈ మూవీలో తండ్రి పాత్రలో రవితేజ కనిపించబోతున్నాడు. ఇప్పటికే ఇందులో నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చెయ్యగా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ క్రమంలోనే తాజాగా శ్రీరామనవమి పండుగ సందర్భంగా స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. 'ప్రేమ, ఆప్యాయతతో ముడిపడిన ఒక తండ్రి, ముచ్చటైన కూతురి కథ' అనే క్యాప్షన్ ఇచ్చి షేర్ చేసిన ఈ పోస్టర్‌లో రవితేజ తన కూతురుతో ఎంతో సంతోషంగా ఉన్నట్లు చూపించారు. ప్రజెంట్ ఈ పోస్టర్ నెట్టింట విశేషంగా ఆకట్టుకుంటోంది. కాగా.. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి జీవి ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు. ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా, సాయి కుమార్, అజయ్ ఘోస్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ డిఫరెంట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రానికి సంబంధించిన రిలీజ్ డేట్ త్వరలో ప్రకటించనున్నారు మేకర్స్.


# అందాన్ని ఆస్వాదించండి



బీటౌన్ బ్యూటీ దిశా పటానీ 'కల్కి' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది. ప్రభాస్, రాజమౌళి కాంబినేషన్‌లో వచ్చిన ఈ మూవీలో పాన్ ఇండియా రేంజ్‌లో విజయం అందుకున్నప్పటికీ.. ఇందులో దిశ పాత్రకు మాత్రం అంతగా బజ్ రాలేదు. అయితే.. రీసెంట్ ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ బ్యూటీ కల్కి 2లో మాత్రం తన పాత్ర చాలా కీలకంగా ఉండబోతున్నట్లు తెలుపగా ఈ యంగ్ బ్యూటీ ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు. ఇక సినిమాల విషయం పక్కన పెడితే నిత్యం సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉండే ఈ బోల్డ్ బ్యూటీ.. తన గ్లామర్‌తో యూత్‌ను మెస్మరైజ్ చేస్తూ ఉంటుంది. అలాగే బోల్డ్ లుక్‌లో కనిపించడంతో విమర్శలు సైతం ఎదురవుతుంటాయి.

# 'వాల్మీకి రామాయణం' ఫస్ట్ లుక్ విడుదల

భారతీయ ఇతిహాసం రామాయణాన్ని వెండితెరపై మరోసారి ఆవిష్కరించేందుకు సిద్ధమవుతుంది జాతీయ అవార్డు గ్రహీత, దర్శకురాలు భావనా తల్వార్. ఆమె దర్శకత్వంలో రాబోతున్న తాజా చిత్రం 'వాల్మీకి రామాయణం'. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ గురువారం విడుదల చేశారు. భక్తి మరియు భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా ఉన్న ఈ పోస్టర్ ప్రస్తుతం సినీ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో శ్రీరాముడి పాదాలను చూపించడం విశేషం. "పర్వతాలు ఉన్నంత కాలం, నదులు ప్రవహించినంత కాలం రామాయణం జీవించే ఉంటుంది" అనే శక్తివంతమైన క్యాప్షన్‌తో ఈ పోస్టర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చారు. చాలా ఏండ్ల తర్వాత భావనా తల్వార్ మెగాఫోన్ పట్టి ఈ సినిమా తెరకెక్కిస్తుండటంతో మూవీపై భారీ అంచనాలు






# పూజాకు త్రివిక్రమ్ మరో చాన్స్

దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్- హీరోయిన్ పూజా హెగ్డే కాంబినేషన్ టాలీవుడ్ లో ఇప్పటికే ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. ఆ కాంబోలో వచ్చిన సినిమాలు కేవలం కమర్షియల్ సక్సెస్ మాత్రమే కాకుండా, ఆడియన్స్ కు మంచి ఎంటర్టైన్మెంట్ కూడా అందించాయి. ఇప్పుడు మళ్లీ ఆ కాంబినేషన్ గురించి వార్తలు రావడం సినీ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. త్రివిక్రమ్ దర్శకత్వంలో పూజా హెగ్డే మొదటిసారి నటించిన చిత్రం అరవింద సమేత వీర రాఘవ. ఆ సినిమాలో ఆమె పాత్రకు మంచి రెస్పాన్స్ లభించింది. ఆ తర్వాత వీరిద్దరి కాంబినేషన్ లో వచ్చిన అల వైకుంఠపురంలో భారీ విజయాన్ని సాధించింది. ఆ మూవీ బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించడంతో పాటు, పూజకు స్టార్ హీరోయిన్ గా మరింత క్రేజ్ తెచ్చిపెట్టింది. ఆమె గ్లామర్, స్క్రీన్ ప్రెజెన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆ రెండు విజయాలతో త్రివిక్రమ్- పూజా కాంబినేషన్ పై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఏర్పడ్డాయి. అయితే తర్వాత కొన్ని ప్రాజెక్టుల్లో మార్పులు చోటుచేసుకోవడంతో మళ్లీ కలిసి పని చేసే అవకాశం రాలేదు. గుంటూరు కారం సినిమాలో మొదట పూజనే హీరోయిన్ గా ఎంపికైనప్పటికీ, తర్వాత ఆమె ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవడం చర్చనీయాంశమైంది. అలా ఛాన్సులు రాకపోవడంతో పూజా టాలీవుడ్ లో కొంత గ్యాప్ తీసుకున్నట్లు కనిపించింది. ఈ నేపథ్యంలో మళ్లీ త్రివిక్రమ్ సినిమాతో ఆమె పేరు వినిపించడం విశేషంగా మారింది. ప్రస్తుతం త్రివిక్రమ్ తెరకెక్కిస్తున్న'ఆదర్శ కుటుంబం చిత్రంలో హీరోగా వెంకటేష్ నటిస్తున్నారు. హీరోయిన్ గా శ్రీనిధి శెట్టి యాక్ట్ చేస్తున్నారు. ఇప్పుడు పూజను త్రివిక్రమ్ రంగంలోకి దింపనున్నారని వినికిడి. అయితే సినిమాలో పూజా హెగ్డే హీరోయిన్ గా కాకుండా స్పెషల్ సాంగ్ లో కనిపించనున్నట్లు టాక్ వినిపిస్తోంది.



## ఉప్పల్‌లో 7 మ్యాచ్‌లు.. సన్ రైజర్స్ పూర్తి షెడ్యూల్ విడుదల

మార్చి 28: రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వర్సెస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ (బెంగళూరు, రాత్రి 7:30 గంటలకు)
ఏప్రిల్ 2: కోల్‌కతా నైట్‌రైడర్స్ వర్సెస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ (కోల్‌కతా, రాత్రి 7:30 గంటలకు)
ఏప్రిల్ 5: సన్‌రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ లక్నో సూపర్ జెయింట్స్(హైదరాబాద్, మధ్యాహ్నం 3:30 గంటలకు)
ఏప్రిల్ 11: పంజాబ్ కింగ్స్ వర్సెస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ (ముల్లాన్‌పూర్, మధ్యాహ్నం 3:30 గంటలకు)
ఏప్రిల్ 18: సన్‌రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ చెన్నై సూపర్ కింగ్స్(హైదరాబాద్, రాత్రి 7:30 గంటలకు)
ఏప్రిల్ 21: సన్‌రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ ఢిల్లీ క్యాపిటల్స్(హైదరాబాద్, రాత్రి 7:30 గంటలకు)
ఏప్రిల్ 25: రాజస్థాన్ రాయల్స్ వర్సెస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ (జైపూర్, రాత్రి 7:30 గంటలకు)
ఏప్రిల్ 29: ముంబై ఇండియన్స్ వర్సెస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ (ముంబై, రాత్రి 7:30 గంటలకు)
మే 3: సన్‌రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ కోల్‌కతా నైట్‌రైడర్స్ (హైదరాబాద్, మధ్యాహ్నం 3:30 గంటలకు)
మే 6: సన్‌రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ పంజాబ్ కింగ్స్ (హైదరాబాద్, రాత్రి 7:30 గంటలకు)
మే 12: గుజరాత్ టైటాన్స్ వర్సెస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ (అహ్మదాబాద్, రాత్రి 7:30 గంటలకు)
మే 18: చెన్నై సూపర్ కింగ్స్ వర్సెస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ (చెన్నై, రాత్రి 7:30 గంటలకు)
మే 22: సన్‌రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (హైదరాబాద్, రాత్రి 7:30 గంటలకు)

డేవిడ్ వార్నర్ సారథ్యంలో ఐపీఎల్ 2016 టైటిల్ గెలిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్.. 2018, 2024లో ఫైనల్ చేరినా విజేతగా నిలవలేకపోయింది. ఈ సీజన్‌లోనైనా టైటిల్ గెలవాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. ఐపీఎల్ 2026 ప్రారంభ మ్యాచ్‌లోనే డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్‌సీబీతో సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనుంది.

## నేనొచ్చేశా: కమిన్స్

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందు సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులకు ఆ జట్టు కెప్టెన్ ప్యాట్ కమిన్స్ గుడ్ న్యూస్ చెప్పాడు. వెన్ను గాయంతో బాధపడుతున్న తాను వేగంగా కోలుకుంటున్నానని, సీజన్ మధ్యలో బరిలోకి దిగుతానని తెలిపాడు. ఇంగ్లండ్‌తో యాషెస్ సిరీస్ సందర్భంగా వెన్ను గాయానికి గురైన ప్యాట్ కమిన్స్.. అప్పటి నుంచి ఆటకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ గాయం కారణంగానే అతను ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 కూడా ఆడలేదు. ఐపీఎల్ 2026 సీజన్ ఆరంభ మ్యాచ్‌లకు కూడా ప్యాట్ కమిన్స్ దూరమయ్యాడు. అతని గైర్హాజరీలో సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్సీ బాధ్యతలను ఇషాన్ కిషన్‌కు అప్పగించారు. గాయంతో ఆరంభ మ్యాచ్‌లకు దూరమైనా.. ప్యాట్ కమిన్స్ బుధవారం సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుతో కలిసాడు. గాయంతో ఇబ్బంది పడుతున్నా జట్టుతో కలిసి అతను ప్రయాణించనున్నాడు.



బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో బుధవారం జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో కమిన్స్ పాల్గొన్నాడు. వార్మప్‌లు, ఫీల్డింగ్, క్యాచ్‌లు ప్రాక్టీస్ చేశాడు. తక్కువ రనప్‌తో ఖాళీ నెట్స్‌లో కొన్ని బంతులు కూడా బౌలింగ్ చేశాడు. తాజాగా టీమ్ సోషల్ మీడియా టీమ్‌తో మాట్లాడిన కమిన్స్.. తాను కోలుకుంటున్నానని.. సీజన్ మధ్యలో జట్టుకు అందుబాటులోకి వస్తానని చెప్పాడు. 'నేను వెన్ను గాయం నుంచి వేగంగా కోలుకుంటున్నా. ప్రస్తుతం నేను బాగానే ఉన్నా. చిన్నగా నెట్స్‌లో బౌలింగ్ కూడా చేయగలుగుతున్నా. ఐపీఎల్ త్వరలోనే ప్రారంభం కానుంది. కానీ నేను ఆరంభ మ్యాచ్‌లు ఆడలేకపోతున్నా. టోర్నీ మధ్యలో జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. అంతా అనుకున్నట్లు జరిగితే నేను టోర్నీ రెండో భాగం, ఫైనల్స్‌లో మైదానంలోకి దిగుతాను' అని కమిన్స్ తెలిపాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా తొలి మ్యాచ్ చిన్నస్వామి స్టేడియం వేదికగా శనివారం(మార్చి 28న) రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ), సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య తొలి మ్యాచ్ జరగనున్న సంగతి తెలిసిందే.



## కరోలినా మారిన్ గుడ్ బై

బ్యాడ్మింటన్ దిగ్గజం కరోలినా మారిన్ ప్రస్థానం ముగిసింది. తన అద్భుత ఆటతీరుతో ఎన్నో చిరస్మరణీయ విజయాలు సాధించిన మారిన్ తన సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు ప్రకటించింది. మోకాలి గాయం కారణంగా కోర్టుకు దూరమైన మారిన్ తన సోషల్‌మీడియా అకౌంట్ల ద్వారా రిటైర్మెంట్ వీడియో సందేశాన్ని వెలువరించింది. రియో(2016) ఒలింపిక్స్‌లో పసిడి పతకంతో పాటు మూడుసార్లు ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిళ్లు సొంతం చేసుకున్న 32 ఏండ్ల మారిన్ గత కొంత కాలంగా మోకాలి గాయంతో తీవ్రంగా బాధపడుతున్నది. 'ప్రొఫెషనల్ బ్యా డ్మింటన్‌లో నా ప్రయాణం ముగిసింది. గాయంతో శరీరాన్ని ఇబ్బంది పెట్టదల్చుకోలేదు' అని పేర్కొంది.



## రికార్డు ముంగిట భువనేశ్వర్

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ పేసర్ భువనేశ్వర్ కుమార్.. సరికొత్త చరిత్రను లిఖించేందుకు సిద్ధమయ్యాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా తన పాత జట్టు సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగే తొలి మ్యాచ్‌లో భువనేశ్వర్ కుమార్ రెండు వికెట్లు తీస్తే వరల్డ్ రికార్డ్ నమోదు చేయనున్నాడు. ఐపీఎల్ కెరీర్‌లోనే 200 వికెట్లు తీసిన తొలి పేసర్‌గా చరిత్రకెక్కనున్నాడు. ఇప్పటివరకు 190 మ్యాచులు ఆడిన ఈ ఆర్‌సీబీ స్వింగ్ కింగ్ 27.33 సగటుతో 198 వికెట్లు పడగొట్టాడు. ఇందులో రెండు ఐదు వికెట్ల ప్రదర్శనలు, రెండు నాలుగు వికెట్ల ప్రదర్శనలు ఉన్నాయి. ఐపీఎల్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో పంజాబ్ కింగ్స్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ మాత్రమే అతని కంటే ముందున్నాడు. అత్యధిక ఐపీఎల్ వికెట్లు తీసిన పేసర్ల జాబితాలో భువనేశ్వర్ కుమార్ తర్వాత ముంబై ఇండియన్స్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా ఉన్నాడు. అతను 145 మ్యాచుల్లో 22.02 సగటుతో 183 వికెట్లు తీశాడు.


## బ్యాటింగ్ సరే.. బౌలింగ్ ఏది?

### బలహీనంగా హైదరాబాద్ బౌలింగ్.. దుర్భేద్యంగా బ్యాటింగ్ ఆర్డర్

ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ మరో టైటిల్‌పై గురిపెట్టింది. చివరగా ఆరెంజ్ ఆర్మీ డేవిడ్ వార్నర్ సారథ్యంలో 2016లో టైటిల్ అందుకుంది. ఆ తర్వాత 2018, 2024 సీజన్లలో ఫైనల్ చేరినా విజేతగా నిలవలేకపోయింది. గతేడాది పేలవ ప్రదర్శనతో ఆరో స్థానంతో



సరిపెట్టుకుంది. ఈ సారైనా మెరుగైన ప్రదర్శన చేసి టైటిల్ అందుకోవాలనే కసితో ఉంది. అయితే ఫిట్‌నెస్ సమస్యలతో ప్యాట్ కమిన్స్ ఆరంభ మ్యాచ్‌లకు దూరం కావడం జట్టుకు గట్టి ఎదురుదెబ్బ. విధ్వంసకర బ్యాటర్లతో బ్యాటింగ్ విభాగం బలంగా ఉన్నా బౌలింగ్ విభాగం బలహీనంగా ఉంది. ప్యాట్ కమిన్స్ లేని లోటును తీర్చే బౌలర్ ఎవరా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. అంతేకాకుండా వేలంలోకి వదిలేసిన మహమ్మద్ షమీ స్థానాన్ని భర్తీ చేసే బౌలర్ ఎవరూ జట్టులో కనిపించడం లేదు. దాంతోనే సన్‌రైజర్స్ హైదరాబాద్ 250 ప్లస్ పరుగులు చేసినా మ్యాచ్ గెలవలేదని ఆకాశ్ చోప్రా వంటి విశ్లేషకులు బల్ల గుద్ది చెబుతున్నారు. విధ్వంసకర బ్యాటర్లు జట్టులో ఉన్నా.. దూకుడుగా ఆడి ఆల్‌టైమ్ రికార్డు స్కోర్లు నమోదు చేసినా.. జట్టు గెలుస్తుందా? అంటే చెప్పలేని పరిస్థితి నెలకొంది. గత సీజన్‌లోనూ పేలవ బౌలింగ్ సన్‌రైజర్స్ విజయవకాశాలను దెబ్బతీసింది. ప్రాక్టీస్‌లో ఆరెంజ్ ఆర్మీ విధ్వంసకర బ్యాటర్లే దూకుడుగా ఆడి బౌలర్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నారనే వాదన కూడా ఉంది. ఈ క్రమంలోనే దూకుడే జట్టుకు బలం, బలహీనతగా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గత సీజన్లలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్లాట్ పిచ్‌లపై ఆడిన మ్యాచ్‌ల్లో గెలవగా.. స్లో వికెట్స్‌పై ఓటమిపాలైంది. కాస్త నెమ్మదిగా ఉన్న పిచ్‌పై సన్‌రైజర్స్ బ్యాటర్లు తేలిపోతుండగా.. బౌలర్లు పూర్తిగా చేతులెత్తేస్తున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకే సన్‌రైజర్స్ హైదరాబాద్ యువ బౌలర్లను కొనుగోలు చేసింది. స్మరణ్ రవిచంద్రన్, హర్ష్ దూబె, శివాంగ్ కుమార్, ప్రఫుల్ హింగె, శివమ్ మావి, సకిబ్ హుస్సేన్, క్రైనిస్ ఫులెట్రా అనే బౌలర్లను కొనుగోలు చేసింది. అయితే ఇందులో మెజార్టీ ఆటగాళ్లకు ఐపీఎల్ ఆడిన అనుభవం లేదు. వీళ్లలో ఏ ఇద్దరు అసాధారణ ప్రదర్శన కనబర్చినా సన్‌రైజర్స్ బౌలింగ్ కష్టాలు తీరుతాయి. లేదంటే జట్టు మరోసారి ప్లే ఆఫ్స్ చేరకుండా అస్సాం ట్రైన్ ఎక్కాల్సిందే.





## పూర్తి షెడ్యూల్ వచ్చేసింది!

### ఐపీఎల్ మ్యాచుల చిట్టా విడుదల

ఐపీఎల్ 2026 సీజన్‌కు సంబంధించి పూర్తి షెడ్యూల్‌ను భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) ప్రకటించింది. ఐదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో 20 మ్యాచ్‌లతో కూడిన తొలి దశ షెడ్యూల్‌ను ప్రకటించిన బీసీసీఐ.. తాజాగా మిగిలిన 50 మ్యాచ్‌ల వివరాలను వెల్లడించింది. దీంతో మొత్తం 70 లీగ్ మ్యాచులకు సంబంధించిన షెడ్యూల్ వచ్చినట్లైంది. మార్చి 28 నుంచి మే 24 వరకు లీగ్ మ్యాచ్‌లు జరగనుండగా.. మే 31న జరిగే ఫైనల్ మ్యాచ్‌తో ఈ సీజన్‌కు తెరపడనుంది.అయితే ప్లేఆఫ్స్ వేదికలను ఇంకా ఖరారు చేయలేదు. శనివారం(మార్చి 28) బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ), సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగే తొలి మ్యాచ్‌తో ఈ సీజన్‌కు తెరలేవనున్న సంగతి తెలిసిందే. తాజాగా బీసీసీఐ ప్రకటించిన సెకండాఫ్ షెడ్యూల్‌లో 12 వేదికల్లో మొత్తం 50 మ్యాచ్‌లు జరగనుండగా.. ఇందులో 8 డబుల్ హెడర్స్ ఉన్నాయి. డబుల్ హెడర్స్ ఉన్న రోజున మధ్యాహ్నం 3:30 గంటలకు ఒక మ్యాచ్, రాత్రి 7:30 గంటలకు రెండో మ్యాచ్ మొదలవుతుంది. సెకండాఫ్ షెడ్యూల్‌లో తొలి మ్యాచ్ ఏప్రిల్ 13న సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మధ్య జరగనుంది. మొత్తంగా హైదరాబాద్, బెంగళూరు, ముంబై, చెన్నై, కోల్‌కతా, ఢిల్లీ, అహ్మదాబాద్, లక్నో, జైపూర్, ధర్మశాల, న్యూ చండీగఢ్, రాయ్‌పూర్ వేదికల్లో ఐపీఎల్ 2026 మ్యాచ్‌లు జరగనున్నాయి. బుధవారం జరిగిన కెప్టెన్ల సమావేశంలో క్యాచ్‌లపై బీసీసీఐ క్లారిటీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో క్యాచ్‌లకు సంబంధించిన వీడియోలను ప్లే చేసి 10 ఫ్రాంచైజీల కెప్టెన్లకు వివరించినట్లు సమాచారం క్లాజ్ 33.3 ప్రకారం బంతిపై ఫీల్డర్‌కు పూర్తి నియంత్రణ వచ్చినట్లు అంపైర్లు భావిస్తేనే ఔట్ ఇవ్వడం జరుగుతుందని బీసీసీఐ పేర్కొన్నట్లు తెలుస్తోంది. అందుకోసం గత టీ20 ప్రపంచ కప్‌లో కాస్త చర్చకు దారితీసిన క్యాచుల వీడియోలను ప్రదర్శించినట్లు వార్తలు వస్తున్నాయి.



## బాండింగ్ స్ట్రాంగ్ ఉండాలి

భారత బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్, తన భర్త, సహచర క్రీడాకారుడు పారుపల్లి కశ్యప్‌తో విడాకులు తీసుకుంటున్నట్లు గతంలో ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచింది. అయితే, ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని మళ్లీ కలిసిన ఈ జంట ప్రస్తుతం దాంపత్య జీవితాన్ని కొనసాగిస్తోంది. తమ బంధంలో ఎదురైన సవాళ్లు, తిరిగి ఒక్కటవ్వడానికి గల కారణాలను సైనా తాజాగా ఓ ఇంటర్వ్యూలో పంచుకుంది. బంధమంటే వాదనలు గెలవడం కాదని, భాగస్వామ్యంతో కలిసి ప్రయాణించడమని తాము గ్రహించినట్లు ఆమె వెల్లడించింది. ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో సైనా ఈ విషయాలను వెల్లడించింది. "ప్రతి బంధంలో కొన్ని దశలు ఉంటాయి. ఇద్దరు బలమైన వ్యక్తిత్వాలు ఉన్నప్పుడు అభిప్రాయ భేదాలు రావడం సహజం. కానీ పరస్పర గౌరవం, అవగాహన, సమస్యలను పరిష్కరించుకోవాలనే సంకల్పం చాలా ముఖ్యం" అని సైనా పేర్కొంది.

ఈవార్తలు
# ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు
శుక్రవారం 27-3-2026, జగిత్యాల

నేటి ఈవార్తలు | సంపాదకీయం | Editorial

## కాలుష్య నియంత్రణలో ప్రభుత్వాలు విఫలం

దేశాభివృద్ధికి పరిశ్రమలు వెన్నెముక వంటివి అనడంలో సందేహం లేదు. కానీ, ఆ అభివృద్ధి సామాన్యుడి ప్రాణాలను బలితీసుకునేలా ఉండకూడదు. ప్రస్తుతం మన దేశంలో పారిశ్రామిక కాలుష్యం ఒక మహమ్మారిలా విస్తరిస్తోంది. అయితే, దీనిని అరికట్టాల్సిన ప్రభుత్వాలు మాత్రం మొద్దునిద్ర నటిస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణ కంటే పారిశ్రామికవేత్తల ప్రయోజనాలకే ప్రాధాన్యతనిస్తున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి పరిశ్రమకూ నిర్దిష్టమైన కాలుష్య నియంత్రణ నిబంధనలు ఉంటాయి. వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా జలాశయాల్లోకి వదలకూడదని, హానికర వాయువులను వాతావరణంలోకి విడుదల చేయకూడదని చట్టాలు చెబుతున్నాయి. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. అనేక పరిశ్రమలు రాత్రి వేళల్లో విషవాయువులను వదులుతున్నా, వ్యర్థాలను భూగర్భ జలాల్లోకి పంపిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. కాలుష్య నియంత్రణ మండలి కేవలం 'నోటీసుల' జారీకే పరిమితమవుతోంది తప్ప, కఠిన చర్యలు తీసుకోవడంలో వెనుకంజ వేస్తోంది. హైదరాబాద్ శివారులోని పటాన్‌చెరు, చౌటుప్పల్ వంటి ప్రాంతాలు పారిశ్రామిక కాలుష్యానికి నిలయాలుగా మారాయి. గాలి, నీరు విషతుల్యమవ్వడం వల్ల ప్రజలు శ్వాసకోశ వ్యాధులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నారు. వ్యవసాయ భూములు పాడైపోతుంటే, రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అభివృద్ధి అంటే కేవలం జీడీపీ పెరగడం కాదు, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటం. కానీ నేడు "ఆర్థిక వృద్ధి" అనే ముసుగులో పర్యావరణాన్ని యథేచ్ఛగా బలి ఇస్తున్నారు. ఒకవైపు అంతర్జాతీయ వేదికలపై పర్యావరణ పరిరక్షణ గురించి ప్రసంగాలు చేస్తూ, మరోవైపు స్వదేశంలో కాలుష్య కారక పరిశ్రమలకు ఎర్రతివాచీ పరచడం ప్రభుత్వాల ద్వంద్వ వైఖరికి నిదర్శనం. పర్యావరణ అనుమతుల ప్రక్రియను సులభతరం చేసే పేరుతో కఠిన నిబంధనలను నీరుగారుస్తున్నారు. గ్రీన్‌బెల్ట్ నిబంధనలు అమలు కావడం లేదు, అధునాతన సాంకేతికతతో వ్యర్థాల నిర్వహణ చేపట్టేలా పరిశ్రమలపై ఒత్తిడి తేవడం లేదు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు పూర్తి స్వేచ్ఛనిచ్చి, నిబంధనలు ఉల్లంఘించే పరిశ్రమలపై భారీ జరిమానాలు, లైసెన్సుల రద్దు వంటి చర్యలు తీసుకోవాలి. పారిశ్రామిక మండలాల్లోని ప్రజల ఫిర్యాదులపై తక్షణమే స్పందించే యంత్రాంగం ఉండాలి. కేవలం లాభాలే ధ్యేయం కాకుండా, పర్యావరణాన్ని కాపాడుతూ సాగే "సుస్థిర అభివృద్ధి" నమూనాను ప్రోత్సహించాలి. ప్రభుత్వాలు ఇప్పటికైనా తమ వైఖరిని మార్చుకోవాలి. పారిశ్రామిక వేత్తల ప్రయోజనాల కంటే ప్రజల ప్రాణాలే ముఖ్యమని గుర్తించాలి. లేకపోతే, రాబోయే తరాలకు మనం కాలుష్య కాసారాన్ని తప్ప మరేమీ మిగిల్చలేం.




# సాహిత్యాభిషేకం!

- కవులు, కళాకారులు, సామాజికవేత్తలకు పురస్కారాలు
- ఉత్తమ కవితలు రాసిన విద్యార్థులకు నగదు బహుమతులు
- వసుంధర విజ్ఞాన వికాస మండలి ఆధ్వర్యంలో వేడుక
- తెలుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన సాహితీ ప్రియులు

**అనాథాశ్రమాలపై ద్రవించిన హృదయంతో ఓ కవి కవిత..
వృద్ధాశ్రమాలపై నేటి సమాజాన్ని విమర్శిస్తూ ఓ కవయిత్రి కవిత్వం..
సమాజాన్ని తట్టిలేపే పాటలతో విద్యార్థుల గానామృతం..
భవిష్యత్తుకు చదువు ఎంత గొప్పదో చెప్పిన ఓ ఉపాధ్యాయుడు..
ఉమ్మడి కుటుంబం ఎంత ఉన్నతమైనదో వివరించిన ఓ ఉపాధ్యాయిని..
ఇలా ఆద్యంతం.. వసుంధర విజ్ఞాన వికాస మండలి ఆధ్వర్యంలో..
రవీంద్రభారతి వేదికగా 'సాహిత్యాభిషేకం' జరిగింది..!**

వసుంధర విజ్ఞాన వికాస మండలి 33వ వార్షికోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో హైదరాబాద్‌లోని రవీంద్రభారతి – పైడి జయరాజ్ ప్రివ్యూ థియేటర్ వేదికగా వైద్యుల గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన ఈ వేడుకల్లో సాహితీవేత్తలు, రచయితలు, కవులు, కళాకారులు, జర్నలిస్టులు, సామాజిక వేత్తలు పాల్గొన్నారు. ముందుగా అతిథులు రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, తెరసం అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం, ఈవార్తలు ఎడిటర్ బొమ్మకంటి శ్రావణ్ కుమార్, వైద్యుల గ్లోబల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మధుకర్ వైద్యుల, కోట మాధురి తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కోరుకంటి చందర్ మాట్లాడుతూ.. మధుకర్ వైద్యుల చేస్తున్న సాహిత్య సేవను కొనియాడారు. 33 సంవత్సరాలుగా తెలుగు సాహిత్యం కోసం పాటుపడుతున్నారని, సింగరేణి గడ్డపై పుట్టిన వసుంధర వికాస మండలి అంచెలంచెలుగా ఎదుగుతోందని, కవులు, రచయితలను ప్రోత్సహిస్తోందని ప్రశంసించారు. కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారి మాట్లాడుతూ.. సాహితీవేత్తలను కాపాడుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ.. నేటి సమాజంలో చదువు, సామాజిక స్పృహ తదితర అంశాలపై మాట్లాడారు. కవితల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులను ఆయన అభినందించారు. తర్వాత మాట్లాడిన శ్రావణ్ కుమార్.. రీల్స్ చేస్తూ టైంపాస్ చేస్తున్న నేటి కాలంలో, కవితల పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చుతున్న విద్యార్థులను అభినందించారు. మరింత ఉత్సాహంగా కవితలు రాయాలని పిలుపునిచ్చారు. అనంతరం కర్క ముత్తారెడ్డి స్మారక జాతీయ కవితా పురస్కారాలు, చంద్రమోహన్ స్మారక విద్యా పురస్కారాలు, కోలరాజు సుప్రీం సూపర్ డాడీ పురస్కారాలు, జాతీయ స్ఫూర్తి పురస్కారాలను విజేతలకు అందజేశారు. కార్యక్రమంలో రామగుండం కార్పొరేటర్ దేవనపల్లి చక్రపాణి, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ కో ఆర్డినేటర్ బింగి నరేందర్ గౌడ్, కాళోజీ పురస్కార గ్రహీత కోట్ల వెంకటేశ్వర రెడ్డి, కర్క శ్రీధర్ రెడ్డి (కర్క ముత్తారెడ్డి స్మారక ట్రస్ట్), బామండ్లపల్లి రమేశ్ (చంద్రమోహన్ స్మారక ట్రస్ట్), ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, సాహితీవేత్తలు, కవులు తదితరులు పాల్గొన్నారు.

**రవీంద్రభారతి-హైదరాబాద్, మార్చి 26 (ఈవార్తలు)**









**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.